

పసుపు దంచుతున్న మహిళలు

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

అన్నమయ్య
జిల్లా వార్తలు

వైభవంగా హరిద్రా ఘట్టం



కోదండరామునికి పసుపుతో అభిషేకం చేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా హరిద్రా ఘట్టం (పసుపు దంచే) కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం కోదండరామాలయంలో ఈ సంప్రదాయ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మనోజ్‌కుమార్ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని భక్తులకు వివరించారు. తయారు చేసిన పసుపు పొడిని వార్షిక బ్రహ్మోత్సవాల్లో అభిషేకం, కల్యాణం, అక్షింతలు తయారీలో ఉపయోగిస్తామన్నారు. టీటీడీ మహిళా ఉద్యోగులు స్వామివారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, వీఆర్వో నీలిమా, ఎస్వీవీసీవో ఎస్‌జీ పద్మావతి, అర్చకులు రాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, పవన్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.

ఆంధ్రావాల్మీకి.. వావిలకొలను

దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన ఒంటిమిట్ట కోదండరామాలయం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన మహానుభావులు ఎందరో ఉన్నారు. ఎందరో తమ జీవితాన్ని పూర్తిగా స్వామికి అర్పించి కోదండరాముని ఆలయ అభివృద్ధి కోసం పాటు పడ్డారు. వారిలో ఆంధ్రావాల్మీకిగా గుర్తింపు పొందిన వావిలకొలను సుబ్బారావు, బమ్మెర పోతన ముఖ్యులు. ఒకరు ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు సంస్కృతం నుంచి వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించారు. మరొకరు ఇక్కడే కోదండరాముని సన్నిధిలో భాగవతం రాసి చిరస్థాయిగా నిలిచిపోయారు.

- కోదండరాముడి కోసం సర్వం అర్పించిన త్యాగధనుడు
- మహాభాగవతాన్ని కోదండరామునికి అంకితమిచ్చిన బమ్మెర పోతన

రాజంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాభద్రాద్రిగా కీర్తింపబడుతున్న ఏకశిలా నగరి ఒంటిమిట్టలో కోదండరామాలయం కోసం ఆంధ్రావాల్మీకి బిరుదాంకితుడైన వావిలకొలను సుబ్బారావు తన జీవితాన్నే త్యాగం చేశారు. దశాబ్దాల తరబడి కోవెల పదిలంగా ఉందంటే ఆయన చేసిన కృషేనని చెప్పాలి. కడప జిల్లా జమ్మలమడుగులో వావిలకొలను రామచంద్రరావు, కనకమ్మ దంపతులకు వావిలకొలను సుబ్బారావు 23 జనవరి 1863న జన్మించారు. ఎఫ్ఏ వరకు చదివిన ఆయన ఆంగ్ల ఉపాధ్యాయుడుగా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఒకరోజు స్వప్నంలో ఇద్దరు బైరాగులు కనబడి 'ఒంటిమిట్టకు రారాదా..' అని వావిలకొలను సుబ్బారావును పిలిచారట. దీనిని రామాజ్ఞగా భావించిన ఆయన ఒంటిమిట్టకు పయనమయ్యారు. ముందుగా తనకున్న ఆస్తిని అమ్మి కోదండరాముడికి సమర్పించారు. అనంతరం కోదండరామాలయ జీర్ణోద్ధరణ కోసం గోచీ ధరించి, టెంకాయ చిప్ప చేతపట్టి కాలినడకన ఊరూరా తిరిగాడు. భిక్షం రూపంలో వచ్చిన ధనాన్ని, తన శిష్యులు గురుదక్షిణగా సమర్పించిన వస్తు సామాగ్రిని, తన రచనల అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆలయం కోసమే వినియోగించారు.



వావిలకొలను సుబ్బారావు

1934లో శ్రీరామ పట్టాభిషేకం

శిథిలావస్థలో ఉన్న తూర్పు గాలిగోపురాన్ని ఆయన జీర్ణోద్ధరణ చేశారు. గోపురాలకు తలుపులు, గర్భాలయం, అంతరాలయంలో నేలను వావిలకొలను సుబ్బారావు బాగుచేశారు. కోదండరామాలయానికి ఎదురుగా ఉన్న సంజీవరాయస్వామి దేవస్థానాన్ని పునరుద్ధరించారు. శ్రీరామ సేవా కుటీరం, రథశాల, శృంగిశైలం మీద వాల్మీకి ఆశ్రమాన్ని నిర్మించారు. ఇమామ్‌బేగ్ బావి, శ్రీరామ తీర్థాన్నీ పునరుద్ధరించారు. ఉత్సవమూర్తులకు పలు బంగారు ఆభరణాలను చేయించారు. ఆ రోజుల్లోనే సుమారు 2లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. శ్రీరామ పట్టాభిషేకాన్ని 1934లోనే కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించారు.

వావిలకొలను సాహితీసేవ


వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని వావిలకొలను సుబ్బారావు 'శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణం' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకం 'మందరము'గా ప్రసిద్ధి చెందింది. ఒంటిమిట్ట కోదండరామాలయంలో 1908లో గ్రంథాంకిత సభ నిర్వహించారు. అప్పటి నుంచి వాలికొలను సుబ్బారావు ఆంధ్రావాల్మీకి బిరుదును సొంతం చేసుకున్నారు. ఆయన 25సంవత్సరాల వయసులోనే మన్మథ జన్మవృత్తాంతాన్ని తెలిపే శ్రీకుమారాభ్యుదయ గ్రంథాన్ని రచించారు. కేవలం ఒక్క పూటలోనే శ్రీతల్పగిరి రంగనాయక శతకాన్ని చెప్పారు. ఆర్యనీతి, ఆర్యచరిత్ర రత్నావళి, హితచర్య మాళిక, సులభ వ్యాకరణం, సుభద్రవిజయం, విపద భగవద్గీత తదితర గ్రంథాలను రచించారు. కోదండరాముడి సేవలో జీవత పర్యంతం గడిపిన వావిలకొలను సుబ్బారావు 1 ఆగస్టు 1936న పరమపదించారు.



కోదండరాముని కోవెల

బమ్మెర పోతన ఇక్కడివాడే..

సహజ కవిత్వాన్ని సరస్వతి కటాక్షంగా పొందిన బమ్మెర పోతన విష్ణుభక్తుడు. తెలుగులో భాగవతరచన చేయడం తన పూర్వజన్మ సుకృతమని చెప్పుకున్నాడు. అటువంటి బమ్మెర పోతనది ఒంటిమిట్టే. ఈయన భాగవతరచన ఒంటిమిట్ట కోదండరాముని సన్నిధిలోనే చేశారని అంటారు. సహజ పండితునిగా కీర్తినొందిన పోతనామాత్యుడు క్రీ.శ.15వ శతాబ్దానికి చెందినవాడు. పోతన తల్లి లక్కమాంబ, తండ్రి కేశనమంత్రి, అన్న తిప్పన. పోతన ఒంటిమిట్టలో నివసించాడు. ఒక ఇల్లు, ఎకరం పొలం ఉండేది. ఒంటిమిట్ట చెరువు కట్టపై కడప-చెన్నై ప్రధాన రహదారిలో శ్రీనాథుడు పల్లకి ఎక్కిపోతూ కట్టకిందనే పొలాన్ని దున్నుతున్న పోతనను చూసి హాళికుల అని హాస్యమాడినట్లు చెబుతారు. ఒంటిమిట్టలోని కోదండరామస్వామి దేవాలయంలో పురాతనమైన పోతన విగ్రహం ఉంది. ఈ విగ్రహం ఆధారంగానే పలు ప్రాంతాల్లో పోతన విగ్రహాలను తయారు చేశారు.



ఘనంగా బలిజపల్లె గంగమ్మ జాతర





భక్తులకు దర్శనమిస్తున్న బలిజపల్లె గంగమ్మతల్లి, వేలాదిగా పాల్గొన్న భక్తులు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని బలిజపల్లె గంగమ్మ జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచే అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగిస్తూ ఆలయం వద్ద అమ్మవారిని కొలువుదీర్చారు. భారీ బాణాసంచా కాలుస్తూ అమ్మవారిని ఊరేగించారు. రాజంపేట, పుల్లంపేట, నందలూరు, పెనగలూరు, చిట్వేలి, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి పొంగుబాళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట ఏఎస్పీ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జాతరకు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బెంగళూరు వాసి హత్యకేసులో
ముగ్గురికి జీవితఖైదు



జీవిత ఖైదు శిక్ష పడ్డ ముగ్గురు నిందితులతో పోలీసులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన వ్యక్తి మదనపల్లెలో హత్యకు గురైన కేసులో మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి ముగ్గురు నిందితులకు జీవితఖైదు విధించారు. ఏపీపీ జయనారాయణరెడ్డి కథనం మేరకు.. బెంగళూరుకు చెందిన అశోక్ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మదనపల్లెకు వస్తూ పోతూ వుండగా.. 2017 ఆగస్టు 22న స్థానిక ఆర్టీసీ డిపో వెనుక హత్యకు గురయ్యాడు. అప్పట్లో వీఆర్వో నారాయణనాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మదనపల్లె టు టౌన్ సీఐలు నిరంజన్‌కుమార్, సురేష్‌కుమార్‌లు కేసు దర్యాప్తు చేశారు. తగిన సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టడంతో ఈ కేసు ఏడున్నరేళ్ల విచారణ జరిగింది. కేసులో నిందితులైన శవాల భాస్కర్(53), ఎస్.వెంకటేశు(30), కె.కళ్యాణ్‌లపై హత్యా నేరం రుజువు కావడంతో రెండవ అదనపు జిల్లా జడ్జి అబ్రహాం తీర్పు ఇచ్చారు. నిందితులకు జీవితఖైదుతో పాటు ఒక్కొక్కరు రూ.11వేల జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా విధులు నిర్వహించిన పోలీసులు, కోర్టు పోలీసులను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

వైభవంగా ధ్వజారోహణం

- కన్నుల పండువగా.. పట్టాభిరాముడి నగరోత్సవం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తజనం నడుమ ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, విశేష పూజలు జరిగాయి. అనంతరం నాగదోష నివారణ, సంతాన ప్రాప్తి కోసం మహిళలకు కొడి ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణులకు స్నపన తిరుమంజనం గావించి యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పట్టాభిరాముడి ఊంజల్‌సేవ కన్నుల పండువగా సాగింది. రాత్రికి విశేష అలంకరణలతో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని గజవాహనంపై ఆశీనులు గావించి.. మహిళల చలిపిండి దీపారాధనలు, టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాలకు మార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగ రాజు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, కృష్ణరాజు, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు : వాల్మీకిపురం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో రెండోరోజు శుక్రవారం ఉదయం ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి హనుమంత వాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి.

కంచె చేను మేసింది

- విద్యుత్ బిల్లుల పేరుతో వసూళ్లు
- డబ్బులు స్వాహా చేసిన ఘనుడు
- ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనమే కారణం
- ఇది జూనియర్ లైన్‌మ్యాన్ నిర్వాకం



గాలివీడు విద్యుత్ ఉపకేంద్రం

విద్యుత్ వినియోగదారులు నెల నెల చెల్లించే కరెంటు బిల్లుల డబ్బులను కాజేశాడు విద్యుత్‌శాఖలోని ఓ ఉద్యోగి. వినియో గదారులు చెల్లించే విద్యుత్ బిల్లుల సొమ్మును కార్యాలయంలో చెల్లించకుండా గుట్టు చప్పుడు కాకుండా నొక్కేసి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడేవాడు. దీనికితోడు తోటి స్నేహి తులు, నమ్మినవారి దగ్గర చేతిబదులు కింద రూ.వేలల్లో అప్పులు చేశాడు. చివరకు అప్పులు ఎక్కువ కావడం.. విద్యుత్ బిల్లుల డబ్బుల స్వాహా విషయం బయటకు పొక్కడంతో గుట్టు చప్పుడు కాకుండా ఉడాయించాడు. వివరాల్లోకి వెళితే....

గాలివీడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గాలివీడు మండల కేంద్రంలోని సచివాలయంలో రామేశ్వర్‌రెడ్డి జూనియర్ లైన్ మ్యాన్‌గా విధులు నిర్వహించేవాడు. ఇతను ఉద్యోగం వచ్చిన నాటి నుంచి ఇంటింటికి వెళ్లి కరెంటు బిల్లులు వసూలు చేసేవాడు. ఇలా కొన్ని నెలలుగా దాదాపు రూ.5లక్షల వరకు వినియోగదారుల వద్ద నుంచి విద్యుత్ బిల్లులు వసూళ్లు చేసి తన సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా బిల్లు ఇవ్వమని అడిగితే బిల్ తీసే యంత్రం పనిచేయడం లేదని.. పేపర్ అయిపోయిందని.. మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదంటూ నమ్మబలికేవాడు. ఇలా వినియోగదారులు చెల్లించే విద్యుత్ బిల్లుల సొమ్మును కాజేస్తూ.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ జల్సాలు చేసేవాడు. అంతే గాకుండా తెలిసిన వాళ్ల దగ్గర చేతి బదులు కింద ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల నుంచి రూ.2లక్షల వరకు తీసుకున్నాడు. డబ్బులు ఇచ్చిన వారు అడిగితే ఇదిగో అదిగో అంటూ దాటవేస్తూ వచ్చేవాడు. ఇలా దాదాపు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వసూళ్లు చేశాడు. ఈక్రమంలో మూడు రోజుల క్రితం మండల కేంద్రంలోని చిలకలూరిపేటలో విద్యుత్ బకాయిలు చెల్లించాలంటూ సిబ్బంది వినియోగదారుల ఇంటి వద్దకు రావడంతో ఖంగుతిన్నారు. మేము ఇదివరకే జూనియర్ లైన్‌మ్యాన్‌కు డబ్బులు చెల్లించామంటూ వాపోయారు. ప్రస్తుతం సదరు ఉద్యోగి విధి నిర్వహణలో లేడని, మీ బిల్లుల నగదు చెల్లింపులు జరగలేదని వెంటనే కరెంటు బిల్ చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామని సిబ్బంది హెచ్చరించడంతో వినియోగదారులకు విద్యుత్ సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అలాగే గతంలో ఎగువగొట్టివీడు గ్రామంలో విధులు నిర్వ హించిన సమయంలో కూడా పెద్ద ఎత్తున విద్యుత్ బిల్లుల డబ్బులు వసూళ్లకు పాల్పడి స్వాహా చేసినట్లు సమాచారం. ఈ నగదు మొత్తం ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్ప డుతూ అప్పులపాలై ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పరారైనట్లు తోటి ఉద్యోగులు చెబుతున్నారు. వెంటనే జిల్లాస్థాయి విద్యుత్ అధికారులు విచారణ జరిపి సదరు ఉద్యోగిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కాజేసిన సొమ్ము రికవరీ చేసి ఇప్పించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కరెంట్ బిల్లు కట్టడానికి రూ.2800 తీసుకున్నాడు

నా వద్ద కరెంటు బిల్లు కట్టాలని రూ.2800 తీసుకున్నాడు. కానీ కార్యాలయంలో జమ చేయలేదు. దీంతో మరుసటి నెలలో బిల్ మొత్తం చెల్లించాలని సిబ్బంది నన్ను హెచ్చరించారు. అంతేగాక తన వ్యక్తిగత అవసరాల కోసం నా వద్ద అప్పుగా రూ.20 వేలు తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోగా ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు.

-రామచంద్ర, ఎగువగొట్టివీడు

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. జూనియర్ లైన్‌మ్యాన్ రామేశ్వర్‌రెడ్డి గత నెల మార్చి 10 నుంచి విధులకు హాజరు కాకపోవడంతో పరారీలో ఉన్నట్లుగా గుర్తించాం. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసి నివేదికలు పంపించాం. విద్యుత్ బిల్లులు వసూళ్లపై బాధితులు ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.

- విజయ్‌కుమార్‌రెడ్డి, ఏడీ విద్యుత్‌శాఖ, రాయచోటి

ఎండకాలంలో...
దంచికొట్టిన వాన

- గాలి వాన బీభత్సానికి నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- దెబ్బతిన్న పంటలు



ఉప్పరపల్లె వద్ద కూలిన అరటి చెట్లు

అసలే ఎండకాలం.. భగభగ మండుతున్న ఎండలు.. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు.. మేఘాలు కమ్ముకోవడం.. ఉన్న ఫళంగా గాలితో మొదలై.. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈ అకాల వర్షంతో ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు కొంత ఊరట చెందారు. అయితే గాలివాన బీభత్సానికి చెట్లు నేలకూలగా... విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చేతికి అందివచ్చిన పంటలు నేలమట్టమయ్యాయి. ఇక వర్షపు నీటితో రహదారులు, వీధులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో పేదలు ఇబ్బందులు పడ్డారు.

రైల్వేకోడూరు/పెనగలూరు/ములకలచెరువు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మండలంలో గురువారం ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన వర్షం కురిసింది.



అనంతరాజుపేటలో వేపచెట్టుపడిపోయిన దృశ్యం

అనంతరాజుపేట, ఉప్పరపల్లె తదితర ప్రాంతాల్లో వీచిన గాలికి అరటి చెట్లు నేలకూలాయి. అనంతరాజుపేటలో కరెంటు స్తంభాలు నేలకొరగటంతో వైర్లు తెగిపడి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే అధికారులు చర్యలు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. వడ్డిపల్లెకు చెందిన అవులకుంట వెంకటేష్ అనే వ్యక్తి చెందిన సిమెంట్ రేకుల ఇల్లు కుప్పకూలిపోయింది. ఇంటిలో ఉన్న నలుగురు పిల్లలను గ్రామస్తులు సురక్షితంగా కాపాడారు.

పెనగలూరు మండలంలోని నారాయణనెల్లూరు బెస్తపల్లె, ఓబిలి, నల్లపురెడ్డిపల్లె, చక్రంపేట, పొందలూరు, ముద్రపల్లె తదితర ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురిసింది. బెస్తపల్లె - పెనగలూరు మధ్యలో వెలగచెట్లు, వేపచెట్ల కొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో పెనగలూరు - రాజంపేటకు 3 గంటల నుంచి 5 గంటల దాకా రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు అధికారులు రంగంలోకి చెట్ల కొమ్మలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ములకలచెరువులో మధ్యాహ్నం సుమారు 20 నిమిషాల పాటు వర్షం కురిసింది. తిరిగి సాయంత్రం 4.50 గంటల నుంచి అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. అకాల వర్షంతో ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. మురికినీటి కాలు వలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. ముంబాయి - చెన్నై జాతీయ రహదారి, పీటీఎం రోడ్డు, మార్కెట్ యార్డు ప్రాంగణంలో పలు చోట్ల వర్షపు నీరు భారీగా నిలిచిపో యాయి. కదిరిరోడ్డులో విద్యుత్ తీగలపై చెట్టుకొమ్మలు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మండలంలోని బురకాయలకోటలో కూడా 15 నిమిషాలపై పైగా వర్షం కురిసింది.

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పతకాల వేటకు వయసుతో పని లేదని నిరూపిస్తూ చిచ్చరపిడుగు అనిపించు కుంటున్నాడు రైల్వే కోడూరుకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడు పునీత్ రామ్. మూడేళ్ల వయసు నుంచే కఠోర సాధన చేస్తూ విజయాల పరంపర కొనసాగిస్తున్నాడు.
రైల్వేకోడూరు పట్టణానికి చెందిన ఎస్. హరి, దేవి దంపతుల కుమారుడు పునీత్ రామ్. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. కాళ్లకు చక్రాలు కట్టుకుని ఆరేళ్ల వయసు నుంచే పతకాలు కొల్లగొడుతున్నాడు. మూడేళ్ల వయస్సులో స్కేటింగ్ శిక్షకుడు రహమతుల్లా ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభించాడు. 2019లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో మొదలైన ప్రయాణం 29 బంగారు, 10 కాంస్య పతకాలతో దిగ్విజయంగా ముందుకు సాగుతోంది. ఇతని ప్రతిభకు 2019లో చెన్నైలో ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది.

చిచ్చరపిడుగు.. పునీత్‌రామ్!


గోవాలో సాధించిన బంగారు బహుమతితో పునీత్

- స్కేటింగ్‌లో అంతర్జాతీయ ప్రతిభ..
- ఎనిమిదేళ్లకే 29 బంగారు, 10 కాంస్య పతకాలు సొంతం
- ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- ఒలింపిక్స్ లక్ష్యంగా కృషి

పతకాల పంట

- తిరుపతి వేదికగా 2019 ఫిబ్రవరిలో జరిగిన ఆల్ ఇండియా రోలర్ రిలే స్కేటింగ్‌లో 3 బంగారు పతకాలు అందుకున్నాడు. అదే ఏడాది జూన్, ఆగస్టు, అక్టోబరులో గోవా, పుదుచ్చేరి, బెంగుళూరులో జరిగిన ఇండియా రోలర్ రిలే స్కేటింగ్, ఫస్ట్ ఏసియన్ ఆల్ ఇండియా రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఆరు బంగారు, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు.
- 2020 జనవరిలో జరిగిన బెళగావి రూరల్ గేమ్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు.
- 2020-21 ఫిబ్రవరిలో తిరుపతిలో రూరల్ గేమ్స్ ఆసోసియేషన్ పోటీల్లో రెండు బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించాడు.
- 2021 మార్చిలో గోవాలో ఆర్ఆర్ఎస్ఎఫ్ఐ స్కేటింగ్ పోటీల్లో రెండు బంగారు, ఒక కాంస్య పతకాలతో సత్తా చాటాడు.
- 2021 జూలైలో శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఒక బంగారు, కాంస్య పతకాలు సాధించాడు.
- 2022 జూన్‌లో ఉమ్మడి కడప జిల్లాలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఒక బంగారు పతకం, అదే ఏడాది రాష్ట్ర స్థాయిలో బంగారు, కాంస్య పతకాలతో దూసుకెళ్లాడు.
- ఇవే కాకుండా 2022 నుంచి 2024 వరకు వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 బంగారు 2 కాంస్య పతకాలు సాధించి తన సత్తా చూపించాడు.

ఒలింపిక్సే లక్ష్యం

స్కేటింగ్‌లో ప్రావీణ్యం సాధిస్తానని అనుకోలేదు. మా అన్నతో పాటు, నేను స్కేటింగ్‌కు వెళ్లా. నా ప్రతిభను గుర్తించిన మా ట్రైనర్ రహమతుల్లా ప్రోత్సాహం, మా తల్లిదండ్రుల పట్టుదల నన్ను అంతర్జాతీయ పోటీలకు ఎంపిక య్యేలా చేశాయి. నాకు ఈ క్రీడంటే చాలా ఇష్టం. భారత్ తరఫున ఒలింపిక్స్‌లో రాణించాలని నా కోరిక. దేశానికి మంచి పేరు తేవాలన్నదే నా ప్రధాన లక్ష్యం. చదువుకుంటూ లక్ష్యం కోసం కఠోర సాధన చేస్తున్నాను.

\- పునీత్ రామ్

దేశం గర్వించాలి..

మా బాబుకి చిన్నప్పటి నుంచే స్కేటింగ్ అంటే ఎంతో ఇష్టం. మా పెద్ద బాబుతో స్కేటింగ్‌కె శిక్షణకు వెళ్లి స్కేటింగ్ క్రీడాపై ఇష్టం పెంచుకున్నాడు. మూడేళ్ల వయస్సువ నుంచి స్కేటింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. ఉదయం సాయంత్రం వేళల్లో దాదాపు 6 గంటలు పాటు సాధన చేస్తుంటాడు. ఒలింపిక్స్‌లో మన దేశం తరుపున ఆడాలన్న లక్ష్యంతో పాటు చదువుతోపాటు స్కేటింగ్‌లో రాణిస్తున్నాడు. పూనిత్ దేశం గర్వించదగ్గ క్రీడాకారుడు కావాలని మా కోరిక...

\- తల్లిదండ్రులు హరి, దేవి



కార్యకర్తల కష్టాన్ని గుర్తిస్తాం

- క్షణికావేశంతో అఘాయిత్యం చేసుకోవద్దు
- నారా లోకేశ్ ట్వీట్



వెంకటేశ్ ఆరోగ్య పరిస్థితిపై విచారిస్తున్న ఎన్ఆర్ఐ లోకేశ్, ఇన్‌సెట్‌లో వెంకటేశ్ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): "టీడీపీ కార్యకర్తల కష్టాన్ని గుర్తిస్తాం.. కొన్ని కారణాలతో కొందరు క్షణికావేశాలతో అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు.. అలాంటి పని చేయొద్దని చేతులెత్తి దండం పెడుతున్నా. టీడీపీ కార్యకర్తల కష్టాలను తెలుసుకోవడానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, పరిష్కరిస్తాం" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన ఐటీడీపీ కార్యకర్త వేల్పుల వెంకటేశ్ ఆర్థిక సమస్యలతో గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స కోసం మదనపల్లెలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పై విధంగా ట్వీట్ చేశారు. దీంతో పాటు అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజును మదనపల్లెకు పంపి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేల్పుల వెంకటేశ్‌కు భరోసా కల్పించారు. ఎన్ఆర్ఐ లోకేశ్ కొణెదల ఆస్పత్రికి చేరుకుని వేల్పుల వెంకటేశ్ ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష నగదును వెంకటేశ్ కుటుంబీకులకు అందజేశారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆస్పత్రికి చేరుకుని వెంకటేశ్‌కు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. రూ.50 వేల నగదును అందించి వెంకటేశ్ వైద్య ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు రాటకొండ గుర్రప్ప నాయుడు, దొరస్వామినాయుడు, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పెరవలి నవీన్, నిరంజన్‌నాని, మాజీ కౌన్సిలర్ శేషు, చరణ్, గగన్‌సాయి, తదితరులు పాల్గొన్నారు. కాగా.. వెంకటేశ్ తన ఫేస్‌బుక్ ఖాతాలో తాను టీడీపీని నమ్మి ఐదేళ్లుగా నష్టపోయానని, తాను చనిపోయిన తరువాతైనా తన కుటుంబాన్ని, పిల్లల చదువుకు సీఎం, మంత్రి నారాలోకేశ్ సాయం చేయాలని పోస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

వన్యప్రాణిని కాపాడిన గ్రామస్థులు



సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టక్కోలి గ్రామం బీసీ కాలనీలోకి గురువారం వచ్చిన దుప్పిని స్థానికులు కుక్కల బారినుంచి కాపాడారు. వేసవికాలం కావడంతో దాహం కోసం గురువారం దుప్పి గ్రామంలోకి వచ్చింది. దీనిపై కుక్కలు దాడి చేసేందుకు యత్నించగా గ్రామస్థులు కాపాడి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన కడప ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని దుప్పిని అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

పిడుగుపాటుకు మూడు ఆవులు మృతి



పెద్దమండ్యం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు, పిడుగుపాటుకు 3 ఆవులు మృతి చెందాయి. పెద్దమండ్యం మండలంలోని పలుచోట్ల గురువారం సాయంత్రం అర్ధగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చెరువుకిందపల్లి ప్రాంతంలో చింతచెట్టుపై పిడుగు పడడంతో ఆ చెట్టుకింద ఉన్న 3 పాడి ఆవులు అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధిత రైతు నాగేశ్వరనాయుడు తెలిపాడు. దీంతో రూ.2.40 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి బాధితుడిని ఫోన్ ద్వారా పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడికి గాయాలు


చికిత్స పొందుతున్న వృద్ధుడు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. మదనపల్లె పట్టణం, రాజారెడ్డి కాలనీకి చెందిన ఎం.చలపతి నాయుడు(80) గురువారం మండలంలోని కొత్తపల్లె పంచాయతీలోని పొలంలో పనులు చేస్తూ చెత్తకు నిప్పు పెట్టడంతో పక్కనే చెట్టులోని తేనెటీగలు చెదిరిపోయాయి. సమీపంలోనే ఉన్న వృద్ధుడిపై దాడి చేశాయి. ఈ దాడిలో గాయపడిన వృద్ధుడిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గంగమ్మ జాతరలో ఘర్షణ ముగ్గురికి గాయాలు

సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతరలో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే బోనం విషయంలో ఘర్షణ జరగడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని నేకనాపురం ఎస్సీ కాలనీలో గురువారం గంగమ్మ జాతరలో బోనం వివాదం జరిగింది. దీంతో అదే గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి బడిసెతో దాడి చేయగా వెంకటసుబ్బయ్య, గంగాదేవి, పావని గాయపడ్డారు. వీరిని గ్రామస్థులు సిద్దవటం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడ్డ వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని సిద్దవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

పెయింటర్స్ కాలనీలో చోరీ

బి.కొత్తకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని పెయింటర్స్ కాలనీలో పట్టపగలే చోరీ జరిగిందని బాధితులు తెలిపారు. కాలనీలో నివాసం ఉండే బావాజాన్ కుటుంబం గురువారం ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లగా, దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి, రూ.90 వేల విలువ చేసే బంగారం, కొంత నగదు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డిప్యూటీ కలెక్టర్ వినాయకంపై విచారణ

- గతంలో బద్వేలు తహశీల్దారుగా పనిచేసిన వినాయకం
- కమలాపురం తహశీల్దారు, కలసపాడు డీటీ, ఇద్దరు వీఆర్వోలపైనా..

కలికిరి /కడప, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గతంలో బద్వేలు తహశీల్దారుగా పనిచేసి ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టు భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న కె.వినాయకంపై విచారణకు ఆదేశిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు గతంలో బద్వేలు తహశీల్దారు కార్యాలయంలో ఏఆర్ఐగా పనిచేస్తూ ప్రస్తుతం కలసపాడు డిప్యూటీ తహశీల్దారుగా వున్న కె.నాగవాహిని , అప్పట్లో బద్వేలులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ప్రస్తుతం కమలాపురం తహశీల్దారుగా ఉన్న జీవీ మధురవాణిపై కూడా ఈ విచారణ జరుగనుంది. అప్పట్లో బద్వేలు మండలం చెన్నంపల్లెలో పనిచేసి ప్రస్తుతం సీకే దిన్నె మండలం కొప్పర్తి వీఆర్వోగా పనిచేస్తున్న ఎం.ప్రతాప్ రెడ్డి, చెన్నంపల్లె మరో వీఆర్వోగా పనిచేసి ప్రస్తుతం సీకే దిన్నె మండలం ఊటుకూరు వీఆర్వోగా ఉన్న బి.సుప్రజపై కూడా ఈ విచారణ కొనసాగనుంది.

గతంలో బద్వేలు తహశీల్దారు కార్యాలయంలో పనిచేసిన కాలంలో వీరంతా మండలంలోని భాకరాపేట చెరువుకు సంబంధించిన 1797 సర్వే నంబరులో అక్రమంగా ఇళ్ల స్థలాలు కేటాయించారన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై కడప జిల్లా కలెక్టరు 2021 అక్టోబరు 18 ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించారు. రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన అనర్హులైన వారికి ఇళ్ల స్థలాల పేరుతో చెరువు భూమిలో పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరులో ఈ ఐదుగురు అధికారులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి లబ్ధిదారుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నారని ఈ నివేదికలో కలెక్టరు స్పష్టం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురి నుంచి దీనికి సంబంధించిన సంజాయిషీలు సమర్పించాలని 2022 అక్టోబరు 27 ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. వీటిని పరిశీలించిన ప్రభుత్వం మరింత లోతుగా విచారణ చేయించడానికి నిర్ణయించింది.

విచారణ అధికారిగా కడప జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను నియమించింది. ఆమెకు విచారణలో సహకరించడానికి ప్రెజెంటింగ్ అధికారిగా కడప డీఆర్వోను కూడా నియమిస్తూ ఆరు వారాల్లోగా విచారణ నివేదికను సమర్పించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా గురువారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

మండలమీట్‌లో హైడ్రామా

వచ్చినట్టే వచ్చి సమావేశాన్నిబహిష్కరించిన ఎంపీటీసీ సభ్యులు


మరోసారి అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఇస్తున్న ఎంపీటీసీ సభ్యులు

బి.కొత్తకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలమీట్ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో గురువారం హైడ్రామా నడిచింది. ఇంతకు మునుపు కూటమి నాయకులు అడ్డుకున్నారని ఒకసారి.. కోరం లేదని మరోసారి మండలమీట్ వాయిదాపడింది. మూడవసారి సమావేశం జరగాలి, సభ్యులు హాజరైతీరాలి. లేదంటే మండలబాడీనే రద్దయ్యే అవకాశం ఉంది. ఈ లోగా ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ మిగతా సభ్యులు నోటీసు ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం సమావేశం జరపాలని ఎంపీడీవో దిలీప్‌కుమార్ నిర్ణయించారు. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులుండగా అందరూ వైసీపీకి చెందినవారే. వీరిలో గుమ్మసముద్రం సభ్యురాలైన లక్ష్మీనరసమ్మను అప్పట్లో ఎంపీపీగా ఎన్నుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక జరిగిన పరిణామాల నేపథ్యంలో ఎంపీపీతో మిగతా సభ్యులకు పొసగలేదు. దీంతో గురువారం నాటి సమావేశానికి కోరం ఉంటుందా లేదా అనే అనుమానం తలెత్తింది. అయితే నిర్ణీత సమయానికి అందరూ హాజరయ్యారు. రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. కోరం ఉన్నందున సమావేశాన్ని ప్రారంభిస్తున్నామని ఎంపీడీవో ప్రకటించగానే 10 మంది సభ్యులు మూకుమ్మడిగా పోడియం వద్దకు చేరుకుని మరోసారి అవిశ్వాసం నోటీసును ఎంపీడీవోకు అందజేశారు. తాము ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని, విధానపరమైన నిర్ణయాలు, తీర్మానాలు చేయరాదని చెప్పి బయటకు వెళ్లిపోయారు. ఎంపీటీసీ సభ్యుల సంతకాలు ఉన్నందున సభలో వారు లేకుండానే ఎంపీడీవో సమావేశాన్ని కొనసాగించి మమ అనిపించారు. గతంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో సీఐ జీవన్‌గంగానాథ్‌బాబు అదనపు బలగాలను రప్పించి బందోబస్తును పర్యవేక్షించారు. కాగా.. మండలమీట్‌లోనూ, అనంతరం జరిగిన మీడియా సమావేశంలోనూ ఎంపీపీ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మండలపరిషత్‌లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, తన సంతకాలు లేకుండా రూ.72 లక్షలు విత్‌డ్రా చేసుకున్నారని, ఆ డబ్బు ఎవరి ఖాతాలలోకి పోయిందన్న విషయం తేలాలన్నారు.

భూమి ఆన్‌లైన్ చేయలేదని.. రైతు ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు వెంకటాద్రి (ఫైల్‌ఫొటో)

వాల్మీకిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన భూమితో పాటు మిగిలిన తమ భూమికి ఆన్‌లైన్ చేసుకోవాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగివేసారిన ఓ రైతు తీవ్ర మనస్థాపానికి గురై ఉరివేసుకుకున్న సంఘటన గురువారం అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు..
వాల్మీకిపురం మండలం టేకలకోనం సమీపంలోని పెద్దవాకపల్లెకు చెందిన చంద్రగిరి లక్ష్మయ్య మిలటరీలో పనిచేసి రిటైర్ అయ్యారు. మిలటరీ కోటా ద్వారా మండలంలోని సర్వే నెంబరు 1051లో 5.51ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి ఆయన ఏక్‌సాల్ పట్టా పొందారు. ఆయన మరణానంతరం లక్ష్మయ్య భార్య అలివేలమ్మ, వరి కుమారుడు చంద్రగిరి వెంకటాద్రి అదే భూమిలో ఇల్లు కట్టుకుని, వ్యవసాయ బోరు వేసుకుని మూడు దశాబ్దాలుగా వ్యవసాయం ద్వారా జీవనం సాగిస్తున్నారు. అనంతరం వీరి అనుభవంలోని 5.51ఎకరాల భూమిలో దాదాపుగా 3.5ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. అందులో ఇద్దరు రైతులు రెండు ఎకరాలకు పైగా ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసుకున్నారు. మిగిలిన కొంత భాగంలో జగనన్న కాలనీ కోసం స్థలాలను కేటాయించారు.
దీంతో చంద్రగిరి వెంకటాద్రి(59) ఆక్రమణకు గురైన భూమిని తిరిగి తనకు ఇప్పించాలని, మిగిలిన భూమిని రెవెన్యూ రికార్డుల ద్వారా ఆన్‌లైన్ చేయాలంటూ కొద్ది సంవత్సరాలుగా కలెక్టర్ కార్యాలయంతో పాటు స్థానిక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. అయినా రెవెన్యూ అధికారులు స్పందించక పోవడంతో మనస్తాపం చెందిన వెంకటాద్రి.. ఆక్రమణకు గురైన తన భూమి కనీసం తన బిడ్డలకైనా దక్కాలని ఆక్రమణదారుల పేర్లతో పాటు తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది పేర్లను సైతం సూసైడ్ నోట్‌లో రాసి, తన చేతిపై కూడా ఆక్రమణదారుల పేర్లను రాసుకుని తన ఇంటి సమీపంలోని చెట్టుకు గురువారం ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.
దీనిపై వాల్మీకిపురం తహశీల్దార్ పామిలేటి మాట్లాడుతూ.. తాను ఆరునెలల క్రితమే వాల్మీకిపురం తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టానన్నారు. తన వద్దకు రైతు వెంకటాద్రి వచ్చి తన భూమి ఆక్రమణకు గురైందని, భూమిని ఆన్‌లైన్ చేయమని కోరాడన్నారు. అయితే ఆయన అడుగుతున్న భూమి కుంట పొరంబోకు అని హైకోర్టు నిబంధనల మేరకు దానిని రైతు పేరుతో ఆన్‌లైన్ చేయలేమని అన్నారు.

ఉరి వేసుకుని యువకుడు..


మృతుడు షేక్ అన్వర్

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇమామ్ సాబ్ వీధికి చెందిన యువకుడు షేక్ అన్వర్(27) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... అన్వర్ పట్టణంలోని ఓ కిరాణా దుకాణంలో పనిచేస్తూ మద్యానికి బానిస అయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని రాపూర్‌లో ఉన్న తమ బంధువుల ఇంటికి పంపించారు. అక్కడ కూడా తన ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి బషీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : జేసీ

కురబలకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సూచించారు. గురువారం మండలంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో మదనపల్లె డివిజన్ పరిధిలోని రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్దిష్ట సమయంలోగా పూర్తిచేయాలన్నారు. రీ సర్వేలో ఎటువంటి పొరబాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కోర్టులలో వివాదాలు నడుస్తున్న భూముల జోలికి వెళ్లవద్దన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఆ భూములను కాపాడుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితులలో తమ పరిధిలో లేని పనులను చేయకూడదన్నారు. రెవెన్యూలో పలు అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. హౌసింగ్‌లో అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.307


సూచనలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

కలికిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు దినసరి కనీస వేతనాన్ని రూ.307లుగా కేంద్రం నిర్ణయించిందని, దీనికి తగ్గకుండా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ వెంకటరత్నం సూచించారు. వేసవి కాలంలో ప్రతి రోజూ నిర్ణీత లక్ష్యాల మేరకు కూలీలకు తప్పనిసరిగా పని కల్పించాలని ఆదేశించారు. గురువారం స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయంలో వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, కేవీపల్లె మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను ఈ నెల 10వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. ఫారంపాండ్ పనులను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. చెరువులలో మట్టి తవ్వకం పనులకు ఇదే మంచి సమయమని, దాంతో కూలీలకు వంద శాతం పనులు కల్పించాలన్నారు. పండ్లతోటల పెంపకం కోసం రైతులను గుర్తించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పంచ ప్రాధాన్యతా పనులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలికిరి క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, నాలుగు మండలాల ఏపీవోలు, జూనియర్ ఇంజినీర్లు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు, సీఎల్ఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో రామాపురం, గాలివీడు, వీరబల్లి, లక్కిరెడ్డిపల్లెలకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రస్థాయి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కనీసం ఇంతవరకు 50 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారంలోపు వందశాతం విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకుంటే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు అందుతాయన్నారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఒక్కొక్క మండలానికి రూ.9 లక్షల మంజూరు చేశారని, రైతులు రైతు భరోసా కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

సంబేపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రౌతుకుంట గ్రామంలో జరుగుతున్న మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటకి స్ప్రేయింగ్ తప్పక చేయించుకోవాలని సూచించారు. వేసవి కాలం కావడంతో ఆరు బయట నిద్రిస్తుంటారని, దోమతెరలు వాడాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పేడ దిబ్బలు గృహాలకు దూరంగా వేసుకోవాలన్నారు. వీధుల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేని తప్పక పాటించాలని సిబ్బందికి సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, నీరు ఎక్కువగా తాగి వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, సీహెచ్‌వో రాణి, సదాశివారెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్న వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, ఇతర సభ్యులు



జిల్లాకు కీర్తి తెచ్చిన జిల్లా రచయితల సంఘం

● వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ

కడప కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఉగాది పురస్కారాలకు జిల్లా రచయితలసంఘం నుండి ముగ్గురు ఎంపిక కావడం అభినందనీయమని, ఇది మన జిల్లాకు గర్వకారణమని వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ అన్నారు. గురువారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జిల్లా రచయితల సంఘం నిర్వహించిన సత్కార కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, జింకా సుబ్రమణ్యం చేసిన సాహిత్య కృషికి ఉగాది పురస్కారాలు లభించడం హర్షణీయమన్నారు. అనంతరం మైనార్టీ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి డాక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ పొదిలి నాగరాజు, సభ్యులు డాక్టర్ పెద్దిరెడ్డి, నీలవేణి, హరిభూషణ్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, ముడియం కిశోర్, రామాంజనేయులు, మధు, భారవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అందిస్తున్న ఉచిత న్యాయసహాయాన్ని ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం పురుషులు, మహిళల కేంద్రాకారాగాలతో పాటు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన విజిట్ చేశారు. ఈ సందర్భంగా మానసిక వాధిగ్రస్తులైన ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో డాక్టర్ సలహాలను తీసుకుంటూ మందులను వాడాలని సూచించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, ఫిర్యాదుల బాక్సును పరిశీలించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యత, ఖైదీల హక్కులు, ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 గురించి వివరించారు.

చెన్నూరువాసి కువైట్‌లో మృతి



మృతి చెందిన చిన్నదర్గయ్య (ఫైల్)

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన మండ్లూరు చిన్నదర్గయ్య (50) ఇటీవల కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబపోషణ కోసం కొన్నేళ్లుగా కువైట్‌లో ఉన్న చిన్న దర్గయ్య గతనెల 29న అక్కడ కూలీ పనులకు వెళ్తూ ఒక్కసారిగా కుప్పకూలిపడిపోయాడు. గమనించిన ఇతర కూలీలు అతన్ని ఆసుపత్రిలో చేర్పించారు. బ్రెయిన్‌డెడ్ కావడంతో మరుసటి రోజు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా అదేరోజు కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారికి అర్థం కాక అసలు ఏం జరిగింది, ఎలా జరిగిందని అక్కడ ఉన్న ఇతరులకు ఫోను చేసి సమాచారం తెలుసుకోవడం జరిగింది. చిన్నదర్గయ్య గుండెపోటుతో పాటు బ్రెయిన్‌డెడ్ కావడంతో అతని శరీరంలోని గుండె, ఊపిరితిత్తులు, ఇతర కొన్ని భాగాలను ఇతరులకు అమర్చేందుకు అక్కడి వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని చెన్నూరుకు పంపించారు. ఈ క్రమంలో మృతదేహాన్ని భారతదేశం తీసుకువచ్చేందుకు కుటుంబసభ్యులు ఎంతో శ్రమపడ్డారు. ఎట్టకేలకు మృతదేహం చెన్నూరుకు చేరడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి



ఆటోలో మృతిచెందిన అజీజ్

జమ్మలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో దానవులపాడు-చలివెందుల గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై ఆటోలో గురువారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో షేక్ మహ్మద్‌అజీజ్ (40) మృతి చెందాడు. ఉదయం 9 గంటల సమయంలో ఏపీ39వీడీ6438 నంబరు ఆటోలో టెంకాయల లోడు వేసుకుని జమ్మలమడుగుకు వచ్చాడు. అన్‌లోడ్ చేసి తిరిగి ప్రొద్దుటూరుకు వెళుతుండగా ముక్కు నుంచి రక్తం కారిందని స్థానికులు కనుగొని పోలీసులకు తెలిపారు. పోలీసులు వచ్చేసరికి అతను మృతి చెందడంతో మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ప్రమాదాలకు నిలయం.. చెన్నూరు క్రాసింగ్



● చీకటి పడితే భయంభయం
● హైవేలో మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్లు
● తొలగించాలంటున్న ప్రజలు



ప్రమాదకరంగా ఉన్న చెన్నూరు క్రాసింగ్

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ప్రధాన గ్రామంలోకి వచ్చే క్రాసింగ్ గత కొన్నేళ్లుగా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో రాత్రివేళ లైట్లు లేకపోవడంతో చీకటి పడితే హైవే దాటి గ్రామంలోకి రావాలంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు, లేదా వికలాంగులవుతున్నారు. అయినప్పటికీ ఇక్కడ సరైన చర్యలు చేపట్టకపోవడంతో చీకటి పడితే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డుదాటాల్సిన పరిస్థితి. ఈ విషయంపై గతంలో ఎన్నోమార్లు అధికారులకు విన్నవించినా రోడ్డుపాలయ్యాయని ప్రజలు వాపోతున్నారు. 2012 నుండి హైవే రహదారి ఫోర్‌లేన్‌గా మారింది. అంతకు ముందు రెండు లైన్ల రహదారి ఉన్నప్పుడు ఈ క్రాసింగ్ వద్ద ప్రమాదాలు జరిగేవి కావు. అప్పట్లో ట్రాఫిక్ తక్కువగా ఉండేది. అయితే హైవే పనులు పూర్తవడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి, దీంతోపాటు వేగమూ పెరిగింది. అలాగే మలుపు కనిపించకుండా అడ్డంగా ఏపుగా దుబాయ్ చెట్లు పెరిగిపోయాయి. ఈ క్రమంలో రోడ్డును దాటుకుని ప్రజలు చెన్నూరు ప్రధాన గ్రామంలోకి రావాలంటే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉంది. కనీసం లైట్లు అయినా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలు చేతిలో పెట్టుకుని..

క్రాసింగ్ వద్ద 20 ఏళ్లుగా ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అయితే 2012 నుండి ప్రమాదాలు మరీ ఎక్కువ అయ్యాయి. చీకటి పడితే క్రాసింగ్ చూస్తేను గుండె దడదడలాడే పరిస్థితి వచ్చింది. పోలీసుస్టేషన్‌లో 30 ఏళ్ల రికార్డులు పరిశీలిస్తే సుమారు 100 నుండి 150వరకు ఇదే ప్రాంతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి.



మలుపు కనిపించకుండా ఏపుగా పెరిగిన చెట్లు

లైట్లు ఏర్పాటు చేయాలి..



క్రాసింగ్ వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రాత్రివేళ వచ్చే వాహనాల వేగానికి రోడ్డు దాటుకోవాలంటే ఒక్కోసారి పది నిమిషాలు కూడా పడుతుంది. ఒకవేళ రోడ్డు దాటాలనుకున్నా ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం. హైవే అధికారులకు ఎన్నోమార్లు చెప్పాం. రోడ్డు మూస్తాం అంటున్నారు తప్ప ప్రమాదాల నివారణకు చర్యలు మాత్రం చేపట్టడం లేదు. లైట్లు వేస్తే దాని వెలుతురులోనైనా కొంతవరకు ఇబ్బంది లేకుండా రోడ్డు దాటవచ్చు. - ఎస్.మహబూబ్‌బాషా, చెన్నూరు

అరటి తోటను పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్నికి ఆహుతైన అరటి తోట

ముద్దనూరు ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి నల్లబల్లె గ్రామ సమీపంలోని వాసుదేవరెడ్డికి చెందిన అరటితోట ప్రమాదవశాత్తు గురువారం అగ్నికి ఆహుతైంది.దీంతో భారీ నష్టం వాటిల్లింది. బాధితుడి సమాచారం మేరకు... దాదాపు 5ఎకరాల్లో అరటితోట సాగు చేశానని, రెండు వేల పైచిలుకు అరటి చెట్లు రెండవ కాపు వచ్చాయన్నారు. అరటితోట కాలిపోతోందని సమాచారం అందిన వెంటనే తోటవద్దకు వెళ్లి చూడగా చెట్లు కాలిపోతున్నాయని వాపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.16లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

దువ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడీషీటర్లకు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకుని మెలగాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం, రౌడీయిజం చేయడం లాంటి చెడుప్రవర్తనలకు దూరంగా ఉండాలని, సత్‌ప్రవర్తనతో మెలగకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

● ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఎన్డీఏ కుట్ర
● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా




విలేకరులతో మాట్లాడుతున్న అంజాద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మండిపడ్డారు. వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకే ఎన్డీఏ సర్కార్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. గురువారం నగరలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం తమ మతాలను ఆచారాలను పాటించుకునే అవకాశం ఉందన్నారు. మతపరమైన సంస్థలు నడుపుకోవడానికి కూడా రాజ్యాంగం ఆర్టికల్ 26లో స్వేచ్ఛను కల్పించిందన్నారు. ఆర్టికల్ 300 ప్రకారం వచ్చిన వారికి దానం చేసే హక్కును కూడా కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. వీటన్నింటికి వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేకంగా ఉందని, ఇది రాజ్యాంగ ఉల్లంఘనేనని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎన్డీఏ ప్రభుత్వం తూట్లు పొడుస్తూ మైనార్టీలకు అన్యాయం చేస్తూ బిల్లు ప్రవేశపెట్టారని తెలిపారు. వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వానికి చెందుతాయని కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడడం దారుణమన్నారు. ప్రధాని మోదీ పదేళ్లుగా మైనార్టీల అభ్యున్నతి కోసం ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కూటమి పార్టీల ఎంపీలంతా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ప్రత్యేక బస్సులు

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి



కడప మారుతీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా కోదండరాముడి కల్యాణోత్సవానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు కడప డిపో నుండి 35 ప్రత్యేక బస్సులు, పులివెందుల డిపో నుండి 10, బద్వేలు డిపో నుండి 20, జమ్మలమడుగు డిపో నుండి 10, మైదుకూరు డిపో నుండి 5, ప్రొద్దుటూరు నుండి 15, ఇతర డిపోల నుండి మరో 40 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా భక్తుల కోసం కడపవైపు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం నుండి కల్యాణోత్సవం జరిగే ప్రాంతం వరకు ఐదు ఉచిత బస్సులను, అలాగే రాజంపేట వైపు సాలాబాద్‌క్రాస్ పార్కింగ్ స్థలం నుండి మరో ఐదు ఉచిత బస్సులను టీటీడీ సౌజన్యంతో నడుపుతున్నామన్నారు. జిల్లాలోని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాములోరి కల్యాణాన్ని తిలకించి పులకించాలని కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

● 16.50లక్షల నగదు స్వాధీనం

పులివెందుల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం అంబకపల్లె గ్రామ సమీపంలోని కొండలలో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రమణ తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి 8గంటల ప్రాంతంలో జూదస్థావరంపై దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదగాళ్లు, ముగ్గురు డ్రైవర్లను అరెస్టు చేసి.. మూడు కార్లుతో పాటు రూ.16.50లక్షల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ఈ విషయంపై మీడియాకు పొక్కనీయకుండా వ్యవహరించారు. ఇదిలా ఉండగా పట్టుబడిన నగదు రూ.20లక్షలకు పైమాటే ఉన్నట్లు సమాచారం. ఇంత పెద్దఎత్తున నగదు పట్టుబడినప్పటికి మీడియాతో మాట్లాడేందుకు పోలీసులు సుముఖత వ్యక్తం చేయకపోవడం గమనార్హం.

బాలిక అదృశ్యం



జమ్మలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కోవెలకుంట్ల రోడ్డులో లక్ష్మినగర్‌కు చెందిన ఎం.ప్రత్యూష (16) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ప్రత్యూష బుధవారం నుంచి కనబడటం లేదని తల్లి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి

● రిమ్స్‌లో భోజన నాణ్యతను తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



రిమ్స్‌లో భోజనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు షంషీర్‌ఖాన్, హరిత తెలిపారు. నగర శివారులోని రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజన నాణ్యతను గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని స్వయంగా పరీక్షించారు. రోగులకు అందుతున్న భోజనం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్యశ్రీ అమలవుతున్న ప్రైవేటు ఆసుపత్రుల్లో డైట్ కాంట్రాక్టర్లు అందిస్తున్న భోజనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతలో ఎక్కడైనా లోపం కనిపిస్తే స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పంపించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

నకిలీ ఫోన్‌పే యాప్‌తో.. మోసం చేసిన యువకుల అరెస్టు

చాపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన గుజ్జు సాయి, లక్ష్మిపేట గ్రామానికి చెందిన భూమిరెడ్డి వీరాంజనేయరెడ్డి, చాపాడు గ్రామానికి చెందిన ముత్యాల శివశంకర్‌లను గురువారం అరెస్టు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ భవానీ, ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఈ ముగ్గురు యువకులు గత నెల 30న చాపాడులోని పెంచల నరసంహ జనరల్‌స్టోర్ యజమాని నరసింహులును కత్తితో బెదిరించి అంగడిలోని సరుకులను తీసుకుపోయారని, మూడు నెలలుగా ఇలా చేస్తూ సుమారు రూ.3 లక్షలు విలువచేసే సరుకులను తీసుకుపోయారన్నారు. నకిలీ ఫోన్‌పే యాప్‌ను వారి సెల్‌ఫోన్‌లో తయారు చేసుకుని మోసం చేశారన్నారు. వారి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, కత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై ఇంతకుముందు వేరే పోలీసుస్టేషన్‌ల్లో కేసులు కూడా ఉన్నాయని తెలిపారు.

రేషన్‌కార్డు తొలగించారు

● దీంతో పింఛనూ రాలేదు
● చిన్నమాచుపల్లెలో ఓ పేద మహిళ ఆవేదన



రేషన్‌కార్డు తొలగించారని తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన భాగ్యమ్మ

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తన పేరు తొలగించి రేషన్‌కార్డు లేకుండా చేశారని చిన్నమాచుపల్లె దళితవాడకు చెందిన పైడికాల్వ భాగ్యమ్మ (60) ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన భాగ్యమ్మ అక్కడి సిబ్బందికి తన బాధ తెలిపింది. తనకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారని, చాలాఏళ్లుగా భర్త నుండి వేరుపడి ఒంటరిగా జీవిస్తున్నానని, పిల్లలందరికీ పెళ్లిళ్లు అయ్యాయని, ఎవరూ తనను పట్టించుకోవడం లేదని వాపోయింది. నాలుగు నెలలక్రితం వరకు కూడా తనకు రేషన్ బియ్యం వచ్చేవని, ఆ బియ్యంతోనే జీవనం సాగిస్తున్నానని తెలిపింది. నాలుగు నెలలుగా బియ్యం రాకపోవడంతో కారణమేంటని అడిగితే తన రేషన్‌కార్డు లేదని చెబుతున్నారని వాపోయింది. గతంలో పెన్షన్ వస్తుండగా అది కూడా రాకుండా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త నుండి విడిపోయి ఒంటరి మహిళ కావడంతో గతంలో రూ.200 పింఛను ఇచ్చేవారని, తరువాత వెయ్యి ఇచ్చేవారని, ఏమైందో తర్వాత పింఛను ఆపేశారని తెలిపింది. తన రేషన్‌కార్డు ఇచ్చి పింఛను మంజూరు చేయాలని కోరింది. ఉన్నతాధికారుల సమావేశానికి వెళ్లిన తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన రాగానే సమస్యను పరిష్కరిస్తామని రెవెన్యూసిబ్బంది తెలిపారు.

వైవీయూ క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన

● 160 మంది ఎంపిక

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ప్రముఖ బయోకాన్ మల్టీనేషనల్ కంపెనీ వైవీయులో చేపట్టిన ఎంపికలకు తిరుపతి, వైజాగ్, గుంటూరు, రాజమండ్రి, బాపట్ల, అన్నమయ్య, కడప జిల్లాల నుంచే కాకుండా చత్తీస్‌ఘడ్, ఒడిస్సా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 500 మంది ఇంజనీరింగ్, డిగ్రీ, పీఈ అర్హత గల అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ ఈ క్యాంపస్ డ్రైవ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రతిభావంతులకు భవిష్యత్తునిస్తున్న బయోకాన్ కంపెనీని స్వాగతించారు. బయోకాన్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించి 160 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు ప్రొఫెసర్ చంద్రమతి శంకర్, ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధులు డాక్టర్ లలిత, డాక్టర్ గణేష్‌నాయక్, డాక్టర్ సుభాష్‌చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి.. క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన యువత

నీటి తొట్టెల నిర్మాణాలను పూర్తి చేయండి


నీటితొట్టెను పరిశీలిస్తున్న ఎంపీడీవో వరప్రసాద్

రాజంపేట టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పశువుల నీటితొట్టెల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లె పంచాయతీలో నిర్మిస్తున్న పశువుల నీటితొట్టె నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీవో సాలయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఇబ్రహీం, ఉపాధిహామీ సాంకేతిక సహాయకులు మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

సార్లు రారు..సమస్యలు తీరవు


ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఎంపీడీవో కార్యాలయం

సుండుపల్లె, ఏప్రిల్3:సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో గురువారం విధులకు ఒక్క అధికారి కూడా హాజరుకాకపోవడంతో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. పలు సమస్యలతో వచ్చిన ప్రజలు వెనుదిరగాల్సిన పరిస్థితి ఎదురైంది. జిల్లాలోనే అతి పెద్ద మం డలం సుండుపల్లె. అయితే గురువారం మండల అభివృద్ధి అధికారితో పాటు ఆ కార్యాలయంలో పనిచేయాల్సిన ఒక్క అధికారి కూడా విధులకు హాజరు కాలేదు. అధికారులు లేకపోవడంతో ప్రజలు నిరుత్సాహంతో వెనుదిరిగారు. జూనియర్ అసిస్టెంట్ ఒకరు మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీవో సెలవు పెట్టడంతో ఇన్‌చార్జి ఎంపీడీవో సైతం కార్యాలయానికి హాజరుకాకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు వారంలో రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి దాపురించిందని స్థానికులు చెబుతున్నారు.

చినుకు పడితే చిత్తడే


రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీటిలో కలిసిన మురుగు

గాలివీడు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం కురిసిన వర్షానికి రహదారులన్నీ బురదమయ్యాయి. చినుకు పడటం వల్ల చిత్తడిగా మారిపోయాయి. ముఖ్యంగా బస్టాండు నుంచి పెద్దూరుకు వెళ్లే మార్గంలో రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు, వాహన చోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. ఓ మోస్తారు వానకే రోడ్లన్నీ రొచ్చురొచ్చుగా తయారయ్యాయి. కాలువల్లో మురుగునీరు ప్రవహించక వీధులన్నీ కంపుకొడుతున్నాయి. పారిశుధ్యం అధ్వానంగా మారడంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని జనం ఆందోళన చెందుతున్నారు.

'పనులు వేగవంతం చేయండి'

సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని కడప- చెన్నై జాతీయ రహదారి జేఎంజే కళాశాల సమీపం నుంచి ఒంటిమిట్ట గ్రామం వరకు నేషనల్‌హైవే రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, కంపచెట్ల తొలగింపు ప్రక్రియ పనులను వేగవంతం చేయాలని డీఎల్పీవో విజయభాస్కర్ ఆదేశించారు. పనులను గురువారం ఆయన పరిశీలించారు.

భూకబ్జాలను అరికట్టాలని వినతి

సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : భూకబ్జాలను అరికట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు గురువారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో బీసీసెల్ రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి శివప్రసాద్ వినతి పత్రం సమర్పించారు. ఉప్పరపల్లెలో భూకబ్జాలు మితిమీరిపోతున్నాయని, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని బీసీసెల్ కార్యనిర్వహణ కార్యదర్శి శివప్రసాద్ వినతిపత్రం సమర్పించారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

పెనగలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవాలని కడప వ్యవసాయ క్షేత్రం భూసార అధికారులు కవిత, విజయ భారతి పేర్కొన్నారు. పెనగలూరు రైతు భరోసా కేంద్రం పరిధిలోని కోడిచెన్నయ్యగారిపల్లెలో గురువారం రైతులకు వ్యవసాయాధికారి సుబ్రమణ్యం అధ్యక్షతన భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు హర్షవర్దన్, శివారాణి, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు


రోడ్డుపైకి వచ్చిన దుకాణ యజమానిని హెచ్చరిస్తున్న ఎస్ఐ

పుల్లంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):పుల్లంపేట ప్ర ధాన రహదారిలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగించే విధంగా రోడ్డుపైకి దుకాణాలు ఏర్పాటు చేస్తే కేసు నమోదు చేస్తామని పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం ఉదయం నాలుగురోడ్ల కూడలిలో రోడ్లపైకి వచ్చిన దుకాణదారులను ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్తా చెదారం వేయరాదని హెచ్చరించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


పూజలందుకున్న స్వామి, అమ్మవారు

పుల్లంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వత్తలూరు గ్రామంలో గురువారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన రామాలయంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య

సుండుపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తామని ఎంఈవో వెంకటేశ్‌నాయక్, రవీంద్ర నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని రాయవరం తెలుగు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. ప్రైవేటు బడులకు వెళ్లి వేలాది రూపాయలు చెల్లించడం మానుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం బట్టలు, పుస్తకాలను సైతం ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షరీఫ్, ఆర్‌జేయూపీ మండల అధ్యక్షుడు సిద్దునాయక్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు నాగరాజునాయక్, ఎస్టీయూ నాయకులు ఆరీపుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

రైల్వేకోడూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో నాగార్జునరావు అధ్యక్షతన గురువారం ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలో ఇంటింటి సర్వేలు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. పల్లెపండుగలో భాగంగా వేసిన సిమెంట్ రోడ్లను పరిశీలించామన్నారు. ఇంకా చేయాల్సిన పనులపై చర్చించామన్నారు. తహసీల్దార్ మహబూబ్ చాంద్ మాట్లాడుతూ భూసర్వేలు సక్రమంగా సాగుతున్నాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ డీఈ బాలనరసింహులు మాట్లాడుతూ పల్లెపండుగలో భాగంగా పలు రకాల పనులు పూర్తి చేశామని తెలిపారు.

పారిశుధ్యంపై జాగ్రత్త వహించండి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఒంటిమిట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పారిశుధ్యంపై జాగ్రత్త వహించాలని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. గురువారం మండలంలోని నరవకాటిపల్లె సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. త్వరగా సర్వేయర్‌లు పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది షరీఫ్ పాల్గొన్నారు.

6న శ్రీరామ నవమి ఉత్సవాలు

రామాపురం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ సద్గురు దర్బారు సాయి నగర్‌లో ఈ నెల 6వ తేదీ ఆదివారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు శ్రీసమర్థ సద్గురు దర్బారు సాయినాథ మహారాజుల వారికి పంచామృతాభిషేకం జరుగుతుందన్నారు.

పోటీతత్వం పెంపొందించుకోవాలి

నందలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పోటీతత్వం పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి-1 నాగయ్య పేర్కొన్నారు. గురువారం నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు విద్యారంగ పోటీల్లో పాల్గొని పోటీతత్వం పెంపొందించుకోవాలన్నారు. నందలూరు, నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రౌఫ్‌బాషా, జయలలితకుమారి మాట్లాడుతూ అంబేద్కర్‌జయంతి ముందస్తు వేడుకల్లో భాగంగా యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం హర్షణీయమన్నారు. యూటీఎఫ్ మండల నాయకులు ముక్కర హరినాథ్, కాకి రమేష్‌జోషి, కృపానందం, సుధాకర్, ఆనంద్, చిన్నరెడ్డన్న మాట్లాడుతూ ఈ పోటీల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ


కార్డులను పంపిణీ చేస్తున్న షఫీనాయక్

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్కిరెడ్డిపల్లె పంచాయతీలోని 17వ నెంబర్ బూత్‌కు సంబంధించి టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి, బూత్ ఇన్‌చార్జి ఎస్ఎండీ షఫీనాయక్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యకర్తలకు అండగా చేపట్టిన ఐదు లక్షల ప్రమాద బీమా సభ్యత్వ కార్డులను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు మండపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశామన్నారు. తెలుగు యువత అధ్యక్షులు కొలిమి పక్కీరయ్య, యలమంద రవీంద్ర, బషీర్ అహ్మద్, చంద్ర, మస్తాన్‌వలి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ పరీక్షను వినియోగించుకోవాలి

- అఖిల భారత న్యాయవాదుల సంఘం నేతల పిలుపు


మాట్లాడుతున్న న్యాయవాదుల సంఘం నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కోర్టు సముదాయంలో ఈ నెల 5న కడప బార్ అసోసియేషన్ మీటింగ్ హాల్‌లో అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జూనియన్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం కపడ- అన్నమయ్య ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను ఒకే రోజు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 16న జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు హాజరయ్యే యువ న్యాయవాదులు అందరికీ ఈ మోడల్ టెస్ట్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కడప కోర్టు ప్రాంగణంలోని కడప బార్ అసోషియేషన్ మీటింగ్ హాల్‌లో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ మోడల్ పరీక్షను నిర్వహిస్తామన్నారు. మోడల్ పరీక్షకు హాజరు కాదల్చుకున్నవారు 7013740055, 9963328876 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి ఈ నెల 4వ తేదీ సాయంత్రంలోపు పేరు నమోదు చేయించుకోవాలని వారు కోరారు. ఐఏఎల్ జిల్లా కమిటీ నాయకులు చిన్నయ్య, హుమయున్ బాషా, రవిశంకర్, డీ. నాగముని, సిద్దయ్య పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి


టీడీపీ కార్యకర్త పాడిమోస్తున్న పంతగాని (ఇన్‌సెట్) శంకరయ్య (ఫైల్)

రైల్వేకోడూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజపురం దళితవాడకు చెందిన టీడీపీ కార్యకర్త నోసిన శంకరయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ శంకరయ్య పాడి మోశారు. బంధువులను ఓదార్చారు. శంకరయ్య లేని లోటు పార్టీకి తీరనిదన్నారు.

ఇరుకు రోడ్డుపై ఇక్కట్లు


రోడ్డుపై ఇరుక్కుపోయిన లారీ, బస్సు

పెనగలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదర్శ పాఠశాల సమీపం నుంచి వేణుగోపాలస్వామి దేవాలయం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురికావడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. బుధవారం రాత్రి బస్టాండు కూడలికి కొంచెం ముందుగా ధాన్యం తీసుకుపోతున్న ఓ లారీ మరమ్మతులకు గురుకావడంతో సుమారు 2 గంటలసేపు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నిరసనను జయప్రదం చేయండి

- బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమణ


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ రమణ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 3: బీసీల కులగణన చేపట్టాలని ఈ నెల 11న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ కుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమణ పిలుపునిచ్చారు. గురువారం రాయచోటి పట్టణంలో బీసీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కుల గణన చేపట్టడంతో పాటు బీసీల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసనలో అన్నమయ్య జిల్లాలోని బీసీలంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీసీ కుల సమన్వయక కమిటీ జిల్లా చైర్మన్ కేవీ రమణ, కన్వీనర్ ఇడగొట్టు నాగ్వేరరావు, జీవానందం, నాయకులు పాల్గొన్నారు.

7న 'చలో తిరుపతి'ని జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ పిలుపు

రాయచోటిటౌన్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ తిరుపతి నగరంలోని ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యాల యం ఎదుట జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఆవరణంలో చలో తిరుపతి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు అరియర్స్ చెల్లించాలన్నారు. డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, యూఈఈయూ జిల్లా నాయకులు రెడ్డెప్ప, ఖాదర్ బాషా, డివిజన్ నాయకులు డీవీ రమణ, వీరారెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నాగేశ్‌గౌడ్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

'పేద ముస్లింల కోసమే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు'

రాయచోటిటౌన్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి):పేద ముస్లింల సంక్షేమం కోసమే కేంద్రం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును తీసుకొచ్చిందని భారతీయ జనతా పార్టీ రాయచోటి నియోకవర్గ డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక బీజేపీ కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఆస్తులు దేశవ్యాప్తంగా కొంత మంది కంబంధ హస్తాల్లో ఉండిపోయాయన్నారు. ఆ ఆస్తుల ద్వారా పేద ముస్లింలకు ఎటువంటి మేలు జరగడం లేదన్నారు. ప్రతి పేద ముస్లింలకు వక్ఫ్‌బోర్డు ఆస్తులు ఉపయోగపడే విధంగా చూడాలన్న లక్ష్యంతోనే బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ బిల్లు ద్వారా ముస్లిం మైనార్టీ వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఉం టాయన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా సీతారాంపురం జట్టు


ఫైనల్‌లో విజేతగా నిలిచిన సీతారాంపురం జట్టు

నందలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన మంచాలమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన మంచాలమ్మ క్రికెట్ టోర్నమెంట్‌లో సీతారాంపురం జట్టు విజేతగా నిలిచింది. గురువారం ఆడపూరు, ఒంటిమిట్ట మండలం సీతారామపురం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన సీతారాంపురం 142 పరుగులు చేసి విజేతగా నిలిచింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఆడపూరు జట్టు 134 పరుగులు చేసి 8 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మొదటి బహుమతి టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు, రెండో బహుమతి బీజేపీ రాష్ట అధికార ప్రతినిధి ఆదినారాయణ అందజేశారు. విజేతలకు టీడీపీ మండల అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్, మండల క్లస్టర్ ఇన్‌చార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్‌లు కప్‌లు అందజేశారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ చాముండేశ్వరిపేట వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీవో నరసింహులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల మస్టర్ తనిఖీ చేయగా 32 మంది పనులకు హాజరయ్యారన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉదయం 6 నుంచి 11 గంటల వరకు మాత్రమే పనులు చేయాలని, నిర్దేశించిన పనుల్లో కొలతల ప్రకారం పనిచేస్తే ప్రతి కూలీకి రూ.300 వస్తుందన్నారు.

తాగునీటి సమస్యలు తీర్చాలి


నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

రామాపురం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దమళ్ల గ్రామ పరిధిలోని ఓబుల్‌రెడ్డిగారిపల్లె దళితవాడలోని దళితులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని గురువారం ఖాళీ బిందెలతో నిరసన చేప ట్టారు. నిరసనకు సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర మద్దతు తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్ల కోసం నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్పందించి ఈ దళితవాడకి తాగునీటి శాశ్వత పరిష్కారం డ్రైనేజీ వ్యవస్థ వీధి దీపాలు, శ్మశాన వాటికకు దారి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణ, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

- కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్

సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జేఎంజే కాలేజీ సమీపంలో గల రాజీవ్‌స్మృతి వనంలో ప్రసాద్ పర్యవేక్షణలో నర్సరీలో మొక్కల పెంపకం చేపట్టారు. కాలుష్యాన్ని నివారించుటకు అక్కడ వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జూన్ నెలలో మొక్కల పంపిణీ చేపడతామని, పొలాల్లో సాగు చేసేందుకు భూహక్కు, పాసుబుక్కు ఉన్నవారికి ఉచితంగా అందిస్తామన్నారు. ఇతరులకు అవసరమైతే ఆధార్ కార్డు సమర్పించి నర్సరీలో ఎర్ర గన్నేరు, వేప, కానుగ, జామ, ఉసిరి, ఆకుపచ్చచెట్లు, ఎర్రచందనం, నెమలినార, పనస, మామిడి, నేరేడు, మందారం తదితర మొక్కలు తీసుకోవచ్చునన్నారు.

తగులుకుంటే... అంతే సంగతులు


రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న కేబుల్ వైర్లు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒంటెసిద్ధయ్య నగర్ వద్ద ఇటీవల పాత విద్యుత్ స్తంభాలు మార్చి కొత్తవి ఏర్పాటు చేశారు. ఈ విద్యుత్ స్తంభాలకు పలు రకాల కంపెనీల కేబుల్ వైర్లు ఉన్నాయి. అవన్నీ తెగిపడ్డాయి. ఈ వైర్ల వల్ల ప్రతి రోజు ప్రమాదం జరుగుతూనే ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ఈ వైర్లను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అనంతరాజుపేట పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై గురువారం కడప నుంచి తిరుపతికి వెళ్తున్న అంబులెన్స్ ఆటోను ఢీకొనడంతో ఆటోలో ఉన్న ప్రసాద్ అనే వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు అందాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

మే నెలలో రేణిగుంట - కడప రోడ్డును పునరుద్ధరిస్తాం

- కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి వెల్లడి
- బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్


సాయిలోకేశ్, పురందేశ్వరితో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి

రాజంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పూర్తిగా దెబ్బతిన్న కడప - రేణిగుంట డబుల్ లేన్ రోడ్డును మేనెలలో పునరుద్ధరిస్తామని, నిధులు కూడా మంజూరు చేశామని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరి వెల్లడించినట్లు బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పేర్కొన్నారు. ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో కలిసి కడప- రేణిగుంట రోడ్డు కోసం ఢిల్లీలో సాయిలోకేశ్ మంత్రి గడ్కరీకి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రాన్ని పరిశీలించిన మంత్రి గురువారం పురందేశ్వరిని, సాయిలోకేశ్‌ను తన కార్యాలయానికి పిలిపించుకున్నారని తెలిపారు. వినితిపత్రాన్ని పరిశీలించామని, కడప - రేణిగుంట డబుల్ లేన్ రోడ్డు పునరుద్ధరణకు నిధులు మంజూరు చేశామని, మేనెలలో ప్రారంభిస్తామని తమకు తెలియజేసినట్లు లోకేశ్ తెలిపారు. అదేవిధంగా రూ.3600 కోట్లతో కొత్తగా ఏర్పాటు చేయనున్న కడప - రేణిగుంట నాలుగులైన్ల రోడ్డును ఆరు లేన్ల రోడ్డుగా మార్చాలన్న తమ వినతిని పరిశీలించానని, అధికారులతో మాట్లాడి త్వరలో దీనిపై స్పష్టమైన ప్రకటన చేశాస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రికి వినతిపత్రం అందజేసిన 24 గంటల్లోనే తమను పిలిపించి స్పష్టమైన హామీ ఇవ్వడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలిపామన్నారు.

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పతకాల వేటకు వయసుతో పని లేదని నిరూపిస్తూ చిచ్చరపిడుగు అనిపించు కుంటున్నాడు రైల్వే కోడూరుకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడు పునీత్ రామ్. మూడేళ్ల వయసు నుంచే కఠోర సాధన చేస్తూ విజయాల పరంపర కొనసాగిస్తున్నాడు,
రైల్వేకోడూరు పట్టణానికి చెందిన ఎస్. హరి, దేవి దంపతుల కుమారుడు పునీత్ రామ్. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. కాళ్లకు చక్రాలు కట్టుకుని ఆరేళ్ల వయసు నుంచే పతకాలు కొల్లగొడుతున్నాడు. మూడేళ్ల వయస్సులో స్కేటింగ్ శిక్షకుడు రహమతుల్లా ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభించాడు. 2019లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో మొదలైన ప్రయాణం 29 బంగారు, 10 కాంస్య పతకాలతో దిగ్విజయంగా ముందుకు సాగుతోంది. ఇతని ప్రతిభకు 2019లో చెన్నైలో ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది.

చిచ్చరపిడుగు.. పునీత్‌రామ్!


గోవాలో సాధించిన బంగారు బహుమతితో పునీత్

- స్కేటింగ్‌లో అంతర్జాతీయ ప్రతిభ..
- ఎనిమిదేళ్లకే 29 బంగారు, 10 కాంస్య పతకాలు సొంతం
- ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- ఒలింపిక్స్ లక్ష్యంగా కృషి

పతకాల పంట

- తిరుపతి వేదికగా 2019 ఫిబ్రవరిలో జరిగిన ఆల్ ఇండియా రోలర్ రిలే స్కేటింగ్‌లో 3 బంగారు పతకాలు అందుకున్నాడు. అదే ఏడాది జూన్, ఆగస్టు, అక్టోబరులో గోవా, పుదుచ్చేరి, బెంగుళూరులో జరిగిన ఇండియా రోలర్ రిలే స్కేటింగ్, ఫస్ట్ ఏసియన్ ఆల్ ఇండియా రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఆరు బంగారు, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు.
- 2020 జనవరిలో జరిగిన బెళగావి రూరల్ గేమ్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు.
- 2020-21 ఫిబ్రవరిలో తిరుపతిలో రూరల్ గేమ్స్ అసోసియేషన్ పోటీల్లో రెండు బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించాడు.
- 2021 మార్చిలో గోవాలో ఆర్ఆర్ఎస్ఎఫ్ఐ స్కేటింగ్ పోటీల్లో రెండు బంగారు, ఒక కాంస్య పతకాలతో సత్తా చాటాడు.
- 2021 జూలైలో శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఒక బంగారు, కాంస్య పతకాలు సాధించాడు.
- 2022 జూన్‌లో ఉమ్మడి కడప జిల్లాలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఒక బంగారు పతకం, అదే ఏడాది రాష్ట్ర స్థాయిలో బంగారు, కాంస్య పతకాలతో దూసుకెళ్లాడు.
- ఇవే కాకుండా 2022 నుంచి 2024 వరకు వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 బంగారు 2 కాంస్య పతకాలు సాధించి తన సత్తా చూపించాడు.

ఒలింపిక్సే లక్ష్యం

స్కేటింగ్‌లో ప్రావీణ్యం సాధిస్తానని అనుకోలేదు. మా అన్నతో పాటు, నేను స్కేటింగ్‌కు వెళ్లా. నా ప్రతిభను గుర్తించిన మా ట్రైనర్ రహమతుల్లా ప్రోత్సాహం, మా తల్లిదండ్రుల పట్టుదల నన్ను అంతర్జాతీయ పోటీలకు ఎంపిక య్యేలా చేశాయి. నాకు ఈ క్రీడంటే చాలా ఇష్టం. భారత్ తరపున ఒలింపిక్స్‌లో రాణించాలని నా కోరిక. దేశానికి మంచి పేరు తేవాలన్నదే నా ప్రధాన లక్ష్యం. చదువుకుంటూ లక్ష్యం కోసం కఠోర సాధన చేస్తున్నాను.

- పునీత్ రామ్

దేశం గర్వించాలి..

మా బాబుకి చిన్నప్పటి నుంచే స్కేటింగ్ అంటే ఎంతో ఇష్టం. మా పెద్ద బాబుతో స్కేటింగ్‌కె శిక్షణకు వెళ్లి స్కేటింగ్ క్రీడాపై ఇష్టం పెంచుకున్నాడు. మూడేళ్ల వయస్సువ నుంచి స్కేటింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. ఉదయం సాయంత్రం వేళల్లో దాదాపు 6 గంటలు పాటు సాధన చేస్తుంటాడు. ఒలింపిక్స్‌లో మన దేశం తరుపున ఆడాలన్న లక్ష్యంతో పాటు చదువుతోపాటు స్కేటింగ్‌లో రాణిస్తున్నాడు. పూనిత్ దేశం గర్వించదగ్గ క్రీడాకారుడు కావాలని మా కోరిక...

- తల్లిదండ్రులు హరి, దేవి



కార్యకర్తల కష్టాన్ని గుర్తిస్తాం

- క్షణికావేశంతో అఘాయిత్యం చేసుకోవద్దు
- నారా లోకేశ్ ట్వీట్



నారా లోకేశ్ ట్వీట్
వెంకటేశ్ ఆరోగ్య పరిస్థితిపై విచారిస్తున్న ఎన్ఆర్ఐ లోకేశ్, ఇన్‌సెట్‌లో వెంకటేశ్ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): "టీడీపీ కార్యకర్తల కష్టాన్ని గుర్తిస్తాం.. కొన్ని కారణాలతో కొందరు క్షణికావేశాలతో అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు.. అలాంటి పని చేయొద్దని చేతులెత్తి దండం పెడుతున్నా. టీడీపీ కార్యకర్తల కష్టాలను తెలుసుకోవడానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, పరిష్కరిస్తాం" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన ఐటీడీపీ కార్యకర్త వేల్పుల వెంకటేశ్ ఆర్థిక సమస్యలతో గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స కోసం మదనపల్లెలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పై విధంగా ట్వీట్ చేశారు. దీంతో పాటు అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజును మదనపల్లెకు పంపి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేల్పుల వెంకటేశ్‌కు భరోసా కల్పించారు. ఎన్ఆర్ఐ లోకేశ్ కొణెదల ఆస్పత్రికి చేరుకుని వేల్పుల వెంకటేశ్ ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష నగదును వెంకటేశ్ కుటుంబీకులకు అందజేశారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆస్పత్రికి చేరుకుని వెంకటేశ్‌కు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. రూ.50 వేల నగదును అందించి వెంకటేశ్ వైద్య ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు రాటకొండ గుర్రప్ప నాయుడు, దొరస్వామినాయుడు, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పెరవలి నవీన్, నిరంజన్‌నాని, మాజీ కౌన్సిలర్ శేషు, చరణ్, గగన్‌సాయి, తదితరులు పాల్గొన్నారు. కాగా.. వెంకటేశ్ తన ఫేస్‌బుక్ ఖాతాలో తాను టీడీపీని నమ్మి ఐదేళ్లుగా నష్టపోయానని, తాను చనిపోయిన తరువాతైనా తన కుటుంబాన్ని, పిల్లల చదువుకు సీఎం, మంత్రి నారాలోకేశ్ సాయం చేయాలని పోస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

వన్యప్రాణిని కాపాడిన గ్రామస్థులు



సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టక్కోలి గ్రామం బీసీ కాలనీలోకి గురువారం వచ్చిన దుప్పిని స్థానికులు కుక్కల బారినుంచి కాపాడారు. వేసవికాలం కావడంతో దాహం కోసం గురువారం దుప్పి గ్రామంలోకి వచ్చింది. దీనిపై కుక్కలు దాడి చేసేందుకు యత్నించగా గ్రామస్థులు కాపాడి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన కడప ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని దుప్పిని అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

పిడుగుపాటుకు మూడు ఆవులు మృతి



పెద్దమండ్యం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు, పిడుగుపాటుకు 3 ఆవులు మృతి చెందాయి. పెద్దమండ్యం మండలంలోని పలుచోట్ల గురువారం సాయంత్రం అర్ధగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చెరువుకిందపల్లి ప్రాంతంలో చింతచెట్టుపై పిడుగు పడడంతో ఆ చెట్టుకింద ఉన్న 3 పాడి ఆవులు అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధిత రైతు నాగేశ్వరనాయుడు తెలిపాడు. దీంతో రూ.2.40 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి బాధితుడిని ఫోన్ ద్వారా పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడికి గాయాలు


చికిత్స పొందుతున్న వృద్ధుడు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. మదనపల్లె పట్టణం, రాజారెడ్డి కాలనీకి చెందిన ఎం.చలపతి నాయుడు(80) గురువారం మండలంలోని కొత్తపల్లె పంచాయతీలోని పొలంలో పనులు చేస్తూ చెత్తకు నిప్పు పెట్టడంతో పక్కనే చెట్టులోని తేనెటీగలు చెదిరిపోయాయి. సమీపంలోనే ఉన్న వృద్ధుడిపై దాడి చేశాయి. ఈ దాడిలో గాయపడిన వృద్ధుడిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గంగమ్మ జాతరలో ఘర్షణ ముగ్గురికి గాయాలు

సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతరలో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే బోనం విషయంలో ఘర్షణ జరగడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని నేకనాపురం ఎస్సీ కాలనీలో గురువారం గంగమ్మ జాతరలో బోనం వివాదం జరిగింది. దీంతో అదే గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి బడిసెతో దాడి చేయగా వెంకటసుబ్బయ్య, గంగాదేవి, పావని గాయపడ్డారు. వీరిని గ్రామస్థులు సిద్దవటం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడ్డ వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని సిద్దవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

పెయింటర్స్ కాలనీలో చోరీ

బి.కొత్తకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని పెయింటర్స్ కాలనీలో పట్టపగలే చోరీ జరిగిందని బాధితులు తెలిపారు. కాలనీలో నివాసం ఉండే బావాజాన్ కుటుంబం గురువారం ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లగా, దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి, రూ.90 వేల విలువ చేసే బంగారం, కొంత నగదు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డిప్యూటీ కలెక్టర్ వినాయకంపై విచారణ

- గతంలో బద్వేలు తహశీల్దారుగా పనిచేసిన వినాయకం
- కమలాపురం తహశీల్దారు, కలసపాడు డీటీ, ఇద్దరు వీఆర్వోలపైనా..

కలికిరి /కడప, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గతంలో బద్వేలు తహశీల్దారుగా పనిచేసి ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టు భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న కె.వినాయకంపై విచారణకు ఆదేశిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు గతంలో బద్వేలు తహశీల్దారు కార్యాలయంలో ఏఆర్ఐగా పనిచేస్తూ ప్రస్తుతం కలసపాడు డిప్యూటీ తహశీల్దారుగా వున్న కె.నాగవాహిని , అప్పట్లో బద్వేలులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ప్రస్తుతం కమలాపురం తహశీల్దారుగా ఉన్న జీవీ మధురవాణిపై కూడా ఈ విచారణ జరుగనుంది. అప్పట్లో బద్వేలు మండలం చెన్నంపల్లెలో పనిచేసి ప్రస్తుతం సీకే దిన్నె మండలం కొప్పర్తి వీఆర్వోగా పనిచేస్తున్న ఎం.ప్రతాప్ రెడ్డి, చెన్నంపల్లె మరో వీఆర్వోగా పనిచేసి ప్రస్తుతం సీకే దిన్నె మండలం ఊటుకూరు వీఆర్వోగా ఉన్న బి.సుప్రజపై కూడా ఈ విచారణ కొనసాగనుంది.

గతంలో బద్వేలు తహశీల్దారు కార్యాలయంలో పనిచేసిన కాలంలో వీరంతా మండలంలోని భాకరాపేట చెరువుకు సంబంధించిన 1797 సర్వే నంబరులో అక్రమంగా ఇళ్ల స్థలాలు కేటాయించారన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై కడప జిల్లా కలెక్టరు 2021 అక్టోబరు 18 ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించారు. రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన అనర్హులైన వారికి ఇళ్ల స్థలాల పేరుతో చెరువు భూమిలో పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరులో ఈ ఐదుగురు అధికారులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి లబ్ధిదారుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నారని ఈ నివేదికలో కలెక్టరు స్పష్టం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురి నుంచి దీనికి సంబంధించిన సంజాయిషీలు సమర్పించాలని 2022 అక్టోబరు 27 ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. వీటిని పరిశీలించిన ప్రభుత్వం మరింత లోతుగా విచారణ చేయించడానికి నిర్ణయించింది.

విచారణ అధికారిగా కడప జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను నియమించింది. ఆమెకు విచారణలో సహకరించడానికి ప్రెజెంటింగ్ అధికారిగా కడప డీఆర్వోను కూడా నియమిస్తూ ఆరు వారాల్లోగా విచారణ నివేదికను సమర్పించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా గురువారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

మండలమీట్‌లో హైడ్రామా

వచ్చినట్టే వచ్చి సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీ సభ్యులు

బి.కొత్తకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలమీట్ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో గురువారం హైడ్రామా నడిచింది. ఇంతకు మునుపు కూటమి నాయకులు అడ్డుకున్నారని ఒకసారి.. కోరం లేదని మరోసారి మండలమీట్ వాయిదాపడింది. మూడవసారి సమావేశం జరగాలి, సభ్యులు హాజరైతీరాలి. లేదంటే మండలబాడీనే రద్దయ్యే అవకాశం ఉంది. ఈ లోగా ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ మిగతా సభ్యులు నోటీసు ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం సమావేశం జరపాలని ఎంపీడీవో దిలీప్‌కుమార్ నిర్ణయించారు. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులుండగా అందరూ వైసీపీకి చెందినవారే. వీరిలో గుమ్మసముద్రం సభ్యురాలైన లక్ష్మీనరసమ్మను అప్పట్లో ఎంపీపీగా ఎన్నుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక జరిగిన పరిణామాల నేపథ్యంలో ఎంపీపీతో మిగతా సభ్యులకు పొసగలేదు. దీంతో గురువారం నాటి సమావేశానికి కోరం ఉంటుందా లేదా అనే అనుమానం తలెత్తింది. అయితే నిర్ణీత సమయానికి అందరూ హాజరయ్యారు. రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. కోరం ఉన్నందున సమావేశాన్ని ప్రారంభిస్తున్నామని ఎంపీడీవో ప్రకటించగానే 10 మంది సభ్యులు మూకుమ్మడిగా పోడియం వద్దకు చేరుకుని మరోసారి అవిశ్వాసం నోటీసును ఎంపీడీవోకు అందజేశారు. తాము ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని, విధానపరమైన నిర్ణయాలు, తీర్మానాలు చేయరాదని చెప్పి బయటకు వెళ్లిపోయారు. ఎంపీటీసీ సభ్యుల సంతకాలు ఉన్నందున సభలో వారు లేకుండానే ఎంపీడీవో సమావేశాన్ని కొనసాగించి మమ అనిపించారు. గతంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు అదనపు బలగాలను రప్పించి బందోబస్తును పర్యవేక్షించారు. కాగా.. మండలమీట్‌లోనూ, అనంతరం జరిగిన మీడియా సమావేశంలోనూ ఎంపీపీ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మండలపరిషత్‌లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, తన సంతకాలు లేకుండా రూ.72 లక్షలు విత్‌డ్రా చేసుకున్నారని, ఆ డబ్బు ఎవరి ఖాతాలలోకి పోయిందన్న విషయం తేలాలన్నారు.



మరోసారి అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఇస్తున్న ఎంపీటీసీ సభ్యులు

భూమి ఆన్‌లైన్ చేయలేదని.. రైతు ఆత్మహత్య

వాల్మీకిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన భూమితో పాటు మిగిలిన తమ భూమికి ఆన్‌లైన్ చేసుకోవాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగివేసారిన ఓ రైతు తీవ్ర మనస్థాపానికి గురై ఉరివేసుకున్న సంఘటన గురువారం అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు..
వాల్మీకిపురం మండలం టేకలకోనం సమీపంలోని పెద్దవాకపల్లెకు చెందిన చంద్రగిరి లక్ష్మయ్య మిలటరీలో పనిచేసి రిటైర్ అయ్యారు. మిలటరీ కోటా ద్వారా మండలంలోని సర్వే నెంబరు 1051లో 5.51ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి ఆయన ఏక్‌సాల్ పట్టా పొందారు. ఆయన మరణానంతరం లక్ష్మయ్య భార్య అలివేలమ్మ, వరి కుమారుడు చంద్రగిరి వెంకటాద్రి అదే భూమిలో ఇల్లు కట్టుకుని, వ్యవసాయ బోరు వేసుకుని మూడు దశాబ్దాలుగా వ్యవసాయం ద్వారా జీవనం సాగిస్తున్నారు. అనంతరం వీరి అనుభవంలోని 5.51ఎకరాల భూమిలో దాదాపుగా 3.5ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. అందులో ఇద్దరు రైతులు రెండు ఎకరాలకు పైగా ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసుకున్నారు. మిగిలిన కొంత భాగంలో జగనన్న కాలనీ కోసం స్థలాలను కేటాయించారు.
దీంతో చంద్రగిరి వెంకటాద్రి(59) ఆక్రమణకు గురైన భూమిని తిరిగి తనకు ఇప్పించాలని, మిగిలిన భూమిని రెవెన్యూ రికార్డుల ద్వారా ఆన్‌లైన్ చేయాలంటూ కొద్ది సంవత్సరాలుగా కలెక్టర్ కార్యాలయంతో పాటు స్థానిక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. అయినా రెవెన్యూ అధికారులు స్పందించక పోవడంతో మనస్తాపం చెందిన వెంకటాద్రి.. ఆక్రమణకు గురైన తన భూమి కనీసం తన బిడ్డలకైనా దక్కాలని ఆక్రమణదారుల పేర్లతో పాటు తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది పేర్లను సైతం సూసైడ్ నోట్‌లో రాసి, తన చేతిపై కూడా ఆక్రమణదారుల పేర్లను రాసుకుని తన ఇంటి సమీపంలోని చెట్టుకు గురువారం ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పతికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.
దీనిపై వాల్మీకిపురం తహశీల్దార్ పామిలేటి మాట్లాడుతూ.. తాను ఆరునెలల క్రితమే వాల్మీకిపురం తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టానన్నారు. తన వద్దకు రైతు వెంకటాద్రి వచ్చి తన భూమి ఆక్రమణకు గురైందని, భూమిని ఆన్‌లైన్ చేయమని కోరాడన్నారు. అయితే ఆయన అడుగుతున్న భూమి కుంట పోరంబోకు అని హైకోర్టు నిబంధనల మేరకు దానిని రైతు పేరుతో ఆన్‌లైన్ చేయలేమని అన్నారు.


ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు వెంకటాద్రి (ఫైల్‌ఫొటో)

ఉరి వేసుకుని యువకుడు..


మృతుడు షేక్ అన్వర్

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇమామ్ సాబ్ వీధికి చెందిన యువకుడు షేక్ అన్వర్(27) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... అన్వర్ పట్టణంలోని ఓ కిరాణా దుకాణంలో పనిచేస్తూ మద్యానికి బానిస అయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని రాపూర్‌లో ఉన్న తమ బంధువుల ఇంటికి పంపించారు. అక్కడ కూడా తన ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి బషీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : జేసీ

కురబలకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సూచించారు. గురువారం మండలంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో మదనపల్లె డివిజన్ పరిధిలోని రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్దిష్ట సమయంలోగా పూర్తిచేయాలన్నారు. రీ సర్వేలో ఎటువంటి పొరబాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కోర్టులలో వివాదాలు నడుస్తున్న భూముల జోలికి వెళ్లవద్దన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఆ భూములను కాపాడుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితులలో తమ పరిధిలో లేని పనులను చేయకూడదన్నారు. రెవెన్యూలో పలు అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. హౌసింగ్‌లో అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.307


సూచనలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

కలికిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు దినసరి కనీస వేతనాన్ని రూ.307లుగా కేంద్రం నిర్ణయించిందని, దీనికి తగ్గకుండా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ వెంకటరత్నం సూచించారు. వేసవి కాలంలో ప్రతి రోజూ నిర్ణీత లక్ష్యాల మేరకు కూలీలకు తప్పనిసరిగా పని కల్పించాలని ఆదేశించారు. గురువారం స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయంలో వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, కేవీపల్లె మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను ఈ నెల 10వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. ఫారంపాండ్ పనులను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. చెరువులలో మట్టి తవ్వకం పనులకు ఇదే మంచి సమయమని, దాంతో కూలీలకు వంద శాతం పనులు కల్పించాలన్నారు. పండ్లతోటల పెంపకం కోసం రైతులను గుర్తించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పంచ ప్రాధాన్యతా పనులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలికిరి క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, నాలుగు మండలాల ఏపీవోలు, జూనియర్ ఇంజినీర్లు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు, సీఎల్ఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో రామాపురం, గాలివీడు, వీరబల్లి, లక్కిరెడ్డిపల్లెలకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రస్థాయి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కనీసం ఇంతవరకు 50 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారంలోపు వందశాతం విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకుంటే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు అందుతాయన్నారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఒక్కొక్క మండలానికి రూ.9 లక్షల మంజూరు చేశారని, రైతులు రైతు భరోసా కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

సంబేపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రౌతుకుంట గ్రామంలో జరుగుతున్న మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటకి స్ప్రేయింగ్ తప్పక చేయించుకోవాలని సూచించారు. వేసవి కాలం కావడంతో ఆరుబయట నిద్రిస్తుంటారని, దోమతెరలు వాడాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పేడ దిబ్బలు గృహాలకు దూరంగా వేసుకోవాలన్నారు. వీధుల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేని తప్పక పాటించాలని సిబ్బందికి సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, నీరు ఎక్కువగా తాగి వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, సీహెచ్‌వో రాణి, సదాశివారెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్న వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, ఇతర సభ్యులు



జిల్లాకు కీర్తి తెచ్చిన జిల్లా రచయితల సంఘం

● వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ

కడప కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉగాది పురస్కారాలకు జిల్లా రచయితలసంఘం నుండి ముగ్గురు ఎంపిక కావడం అభినందనీయమని, ఇది మన జిల్లాకు గర్వకారణమని వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ అన్నారు. గురువారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జిల్లా రచయితల సంఘం నిర్వహించిన సత్కార కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, జింకా సుబ్రమణ్యం చేసిన సాహిత్య కృషికి ఉగాది పురస్కారాలు లభించడం హర్షణీయమన్నారు. అనంతరం మైనార్టీ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి డాక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ పొదిలి నాగరాజు, సభ్యులు డాక్టర్ పెద్దిరెడ్డి, నీలవేణి, హరిభూషణ్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, ముడియం కిశోర్, రామాంజనేయులు, మధు, భారవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అందిస్తున్న ఉచిత న్యాయసహాయాన్ని ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ అన్నారు. గురువారం పురుషులు, మహిళల కేంద్రాకారాగాలతో పాటు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన విజిట్ చేశారు. ఈ సందర్భంగా మానసిక వాధిగ్రస్తులైన ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో డాక్టర్ సలహాలను తీసుకుంటూ మందులను వాడాలని సూచించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, ఫిర్యాదుల బాక్సును పరిశీలించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యత, ఖైదీల హక్కులు, ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 గురించి వివరించారు.

చెన్నూరు వాసి కువైట్‌లో మృతి



మృతి చెందిన చిన్నదర్గయ్య (ఫైల్)

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన మండ్లూరు చిన్నదర్గయ్య (50) ఇటీవల కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబపోషణ కోసం కొన్నేళ్లుగా కువైట్‌లో ఉన్న చిన్నదర్గయ్య గతనెల 29న అక్కడ కూలీ పనులకు వెళ్తూ ఒక్కసారిగా కుప్పకూలిపడిపోయాడు. గమనించిన ఇతర కూలీలు అతన్ని ఆసుపత్రిలో చేర్పించారు. బ్రెయిన్‌డెడ్ కావడంతో మరుసటి రోజు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా అదేరోజు కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారికి అర్థం కాక అసలు ఏం జరిగింది, ఎలా జరిగిందని అక్కడ ఉన్న ఇతరులకు ఫోను చేసి సమాచారం తెలుసుకోవడం జరిగింది. చిన్నదర్గయ్య గుండెపోటుతో పాటు బ్రెయిన్‌డెడ్ కావడంతో అతని శరీరంలోని గుండె, ఊపిరితిత్తులు, ఇతర కొన్ని భాగాలను ఇతరులకు అమర్చేందుకు అక్కడి వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని చెన్నూరుకు పంపించారు. ఈ క్రమంలో మృతదేహాన్ని భారతదేశం తీసుకువచ్చేందుకు కుటుంబసభ్యులు ఎంతో శ్రమపడ్డారు. ఎట్టకేలకు మృతదేహం చెన్నూరుకు చేరడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి



ఆటోలో మృతిచెందిన అజీజ్

జమ్మలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో దానవులపాడు-చలివెందుల గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై ఆటోలో గురువారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో షేక్ మహ్మద్‌అజీజ్ (40) మృతి చెందాడు. ఉదయం 9 గంటల సమయంలో ఏపీ39వీడి6438 నంబరు ఆటోలో టెంకాయల లోడు వేసుకుని జమ్మలమడుగుకు వచ్చాడు. అన్‌లోడ్ చేసి తిరిగి ప్రొద్దుటూరుకు వెళుతుండగా ముక్కు నుంచి రక్తం కారిందని స్థానికులు కనుగొని పోలీసులకు తెలిపారు. పోలీసులు వచ్చేసరికి అతను మృతి చెందడంతో మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ప్రమాదాలకు నిలయం.. చెన్నూరు క్రాసింగ్



● చీకటి పడితే భయంభయం
● హైవేలో మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్లు
● తొలగించాలంటున్న ప్రజలు



ప్రమాదకరంగా ఉన్న చెన్నూరు క్రాసింగ్

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ప్రధాన గ్రామంలోకి వచ్చే క్రాసింగ్ గత కొన్నేళ్లుగా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో రాత్రివేళ లైట్లు లేకపోవడంతో చీకటి పడితే హైవే దాటి గ్రామంలోకి రావాలంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు, లేదా వికలాంగులవుతున్నారు. అయినప్పటికీ ఇక్కడ సరైన చర్యలు చేపట్టకపోవడంతో చీకటి పడితే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డుదాటాల్సిన పరిస్థితి. ఈ విషయంపై గతంలో ఎన్నోమార్లు అధికారులకు విన్నవించినా రోడ్డుపాలయ్యాయని ప్రజలు వాపోతున్నారు. 2012 నుండి హైవే రహదారి ఫోర్‌లేన్‌గా మారింది. అంతకు ముందు రెండు లైన్ల రహదారి ఉన్నప్పుడు ఈ క్రాసింగ్ వద్ద ప్రమాదాలు జరిగేవి కావు. అప్పట్లో ట్రాఫిక్ తక్కువగా ఉండేది. అయితే హైవే పనులు పూర్తవడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి, దీంతోపాటు వేగమూ పెరిగింది. అలాగే మలుపు కనిపించకుండా అడ్డంగా ఏపుగా దుబాయ్ చెట్లు పెరిగిపోయాయి. ఈ క్రమంలో రోడ్డును దాటుకుని ప్రజలు చెన్నూరు ప్రధాన గ్రామంలోకి రావాలంటే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉంది. కనీసం లైట్లు అయినా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలు చేతిలో పెట్టుకుని..

క్రాసింగ్ వద్ద 20 ఏళ్లుగా ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అయితే 2012 నుండి ప్రమాదాలు మరీ ఎక్కువ అయ్యాయి. చీకటి పడితే క్రాసింగ్ చూస్తేను గుండె దడదడలాడే పరిస్థితి వచ్చింది. పోలీసుస్టేషన్‌లో 30 ఏళ్ల రికార్డులు పరిశీలిస్తే సుమారు 100 నుండి 150వరకు ఇదే ప్రాంతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి.



మలుపు కనిపించకుండా ఏపుగా పెరిగిన చెట్లు

లైట్లు ఏర్పాటు చేయాలి..



క్రాసింగ్ వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రాత్రివేళ వచ్చే వాహనాల వేగానికి రోడ్డు దాటుకోవాలంటే ఒక్కోసారి పది నిమిషాలు కూడా పడుతుంది. ఒకవేళ రోడ్డు దాటాలనుకున్నా ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం. హైవే అధికారులకు ఎన్నోమార్లు చెప్పాం. రోడ్డు మూస్తాం అంటున్నారు తప్ప ప్రమాదాల నివారణకు చర్యలు మాత్రం చేపట్టడం లేదు. లైట్లు వేస్తే దాని వెలుతురులోనైనా కొంతవరకు ఇబ్బంది లేకుండా రోడ్డు దాటవచ్చు. - ఎస్.మహబూబ్‌బాషా, చెన్నూరు

అరటి తోటను పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్నికి ఆహుతైన అరటి తోట

ముద్దనూరు ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి నల్లబల్లె గ్రామ సమీపంలోని వాసుదేవరెడ్డికి చెందిన అరటితోట ప్రమాదవశాత్తు గురువారం అగ్నికి ఆహుతైంది.దీంతో భారీ నష్టం వాటిల్లింది. బాధితుడి సమాచారం మేరకు... దాదాపు 5ఎకరాల్లో అరటితోట సాగు చేశానని, రెండు వేల పైచిలుకు అరటి చెట్లు రెండవ కాపు వచ్చాయన్నారు. అరటితోట కాలిపోతోందని సమాచారం అందిన వెంటనే తోటవద్దకు వెళ్లి చూడగా చెట్లు కాలిపోతున్నాయని వాపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.16లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

దువ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడీషీటర్లకు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకుని మెలగాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం, రౌడీయిజం చేయడం లాంటి చెడుప్రవర్తనలకు దూరంగా ఉండాలని, సత్‌ప్రవర్తనతో మెలగకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

● ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఎన్డీఏ కుట్ర
● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా



విలేకరులతో మాట్లాడుతున్న అంజాద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మండిపడ్డారు. వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకే ఎన్‌డీఏ సర్కార్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. గురువారం నగరలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం తమ మతాలను ఆచారాలను పాటించుకునే అవకాశం ఉందన్నారు. మతపరమైన సంస్థలు నడుపుకోవడానికి కూడా రాజ్యాంగం ఆర్టికల్ 26లో స్వేచ్ఛను కల్పించిందన్నారు. ఆర్టికల్ 300 ప్రకారం వచ్చిన వారికి దానం చేసే హక్కును కూడా కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. వీటన్నింటికి వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేకంగా ఉందని, ఇది రాజ్యాంగ ఉల్లంఘనేనని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎన్‌డీఏ ప్రభుత్వం తూట్లు పొడుస్తూ మైనార్టీలకు అన్యాయం చేస్తూ బిల్లు ప్రవేశపెట్టారని తెలిపారు. వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వానికి చెందుతాయని కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడడం దారుణమన్నారు. ప్రధాని మోదీ పదేళ్లుగా మైనార్టీల అభ్యున్నతి కోసం ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కూటమి పార్టీల ఎంపీలంతా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

● 16.50 లక్షల నగదు స్వాధీనం

పులివెందుల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం అంబకపల్లె గ్రామ సమీపంలోని కొండలలో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రమణ తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి 8గంటల ప్రాంతంలో జూదస్థావరంపై దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదగాళ్లు, ముగ్గురు డ్రైవర్లను అరెస్టు చేసి.. మూడు కార్లుతో పాటు రూ.16.50లక్షల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ఈ విషయంపై మీడియాకు పొక్కనీయకుండా వ్యవహరించారు. ఇదిలా ఉండగా పట్టుబడిన నగదు రూ.20లక్షలకు పైమాటే ఉన్నట్లు సమాచారం. ఇంత పెద్దఎత్తున నగదు పట్టుబడినప్పటికి మీడియాతో మాట్లాడేందుకు పోలీసులు సుముఖత వ్యక్తం చేయకపోవడం గమనార్హం.

బాలిక అదృశ్యం



జమ్మలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కోవెలకుంట్ల రోడ్డులో లక్ష్మీనగర్‌కు చెందిన ఎం.ప్రత్యూష (16) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ప్రత్యూష బుధవారం నుంచి కనబడటం లేదని తల్లి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ ఫోన్‌పే యాప్‌తో.. మోసం చేసిన యువకుల అరెస్టు

చాపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన గుజ్జు సాయి, లక్ష్మీపేట గ్రామానికి చెందిన భూమిరెడ్డి వీరాంజనేయరెడ్డి, చాపాడు గ్రామానికి చెందిన ముత్యాల శివశంకర్‌లను గురువారం అరెస్టు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ భవానీ, ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఈ ముగ్గురు యువకులు గత నెల 30న చాపాడులోని పెంచల నరసంహ జనరల్‌స్టోర్ యజమాని నరసింహులును కత్తితో బెదిరించి అంగడిలోని సరుకులను తీసుకుపోయారని, మూడు నెలలుగా ఇలా చేస్తూ సుమారు రూ.3 లక్షలు విలువచేసే సరుకులను తీసుకుపోయారన్నారు. నకిలీ ఫోన్‌పే యాప్‌ను వారి సెల్‌ఫోన్‌లో తయారు చేసుకుని మోసం చేశారన్నారు. వారి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, కత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై ఇంతకుముందు వేరే పోలీసుస్టేషన్‌ల్లో కేసులు కూడా ఉన్నాయని తెలిపారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి

● రిమ్స్‌లో భోజన నాణ్యతను తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



రిమ్స్‌లో భోజనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు షంషీర్‌ఖాన్, హరిత తెలిపారు. నగర శివారులోని రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజన నాణ్యతను గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని స్వయంగా పరీక్షించారు. రోగులకు అందుతున్న భోజనం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్యశ్రీ అమలవుతున్న ప్రైవేటు ఆసుపత్రుల్లో డైట్ కాంట్రాక్టర్లు అందిస్తున్న భోజనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతలో ఎక్కడైనా లోపం కనిపిస్తే స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పంపించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

రాములోరి కల్యాణానికి ప్రత్యేక బస్సులు

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి



కడప మారుతీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా కోదండరాముడి కల్యాణోత్సవానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు కడప డిపో నుండి 35 ప్రత్యేక బస్సులు, పులివెందుల డిపో నుండి 10, బద్వేలు డిపో నుండి 20, జమ్మలమడుగు డిపో నుండి 10, మైదుకూరు డిపో నుండి 5, ప్రొద్దుటూరు నుండి 15, ఇతర డిపోల నుండి మరో 40 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా భక్తుల కోసం కడపవైపు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం నుండి కల్యాణోత్సవం జరిగే ప్రాంతం వరకు ఐదు ఉచిత బస్సులను, అలాగే రాజంపేట వైపు సాలాబాద్‌క్రాస్ పార్కింగ్ స్థలం నుండి మరో ఐదు ఉచిత బస్సులను టీటీడీ సౌజన్యంతో నడుపుతున్నామన్నారు. జిల్లాలోని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాములోరి కల్యాణాన్ని తిలకించి పులకించాలని కోరారు.

పాము కాటుకు మహిళ మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):పాముకాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలం, చీకలబైలులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం మండలంలోని చీకలబైలుకు చెందిన గౌరమ్మ(45) తమ పొలంలో టమోటా చెట్లకు వేసిన కవర్లను తొలగిస్తుండగా ఏదో కరిచినట్లు గుర్తించి ఇంటికి వెళ్లిపోయింది. అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మార్చురికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కడప రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కడప క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ ఆధ్వర్యంలో గురువారం కడప రైల్వేస్టేషనులో తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించారు. అలాగే రైల్వేస్టేషన్ బయట వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. తనిఖీల్లో ఎస్ఐ అమర్‌నాథరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైజంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. మాసాపేట సర్కిల్‌వద్ద టూటౌన్ ఎస్సై హుసేన్ స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

రేషన్‌కార్డు తొలగించారు

● దీంతో పింఛనూ రాలేదు
● చిన్నమాచుపల్లెలో ఓ పేద మహిళ ఆవేదన



రేషన్‌కార్డు తొలగించారని తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన భాగ్యమ్మ

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తన పేరు తొలగించి రేషన్‌కార్డు లేకుండా చేశారని చిన్నమాచుపల్లె దళితవాడకు చెందిన పైడికాల్వ భాగ్యమ్మ (60) ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన భాగ్యమ్మ అక్కడి సిబ్బందికి తన బాధ తెలిపింది. తనకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారని, చాలాఏళ్లుగా భర్త నుండి వేరుపడి ఒంటరిగా జీవిస్తున్నానని, పిల్లలందరికీ పెళ్లిళ్లు అయ్యాయని, ఎవరూ తనను పట్టించుకోవడం లేదని వాపోయింది. నాలుగు నెలలక్రితం వరకు కూడా తనకు రేషన్ బియ్యం వచ్చేవని, ఆ బియ్యంతోనే జీవనం సాగిస్తున్నానని తెలిపింది. నాలుగు నెలలుగా బియ్యం రాకపోవడంతో కారణమేంటని అడిగితే తన రేషన్‌కార్డు లేదని చెబుతున్నారని వాపోయింది. గతంలో పెన్షన్ వస్తుండగా అది కూడా రాకుండా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త నుండి విడిపోయి ఒంటరి మహిళ కావడంతో గతంలో రూ.200 పింఛను ఇచ్చేవారని, తరువాత వెయ్యి ఇచ్చేవారని, ఏమైందో తర్వాత పింఛను ఆపేశారని తెలిపింది. తన రేషన్‌కార్డు ఇచ్చి పింఛను మంజూరు చేయాలని కోరింది. ఉన్నతాధికారుల సమావేశానికి వెళ్లిన తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన రాగానే సమస్యను పరిష్కరిస్తామని రెవెన్యూసిబ్బంది తెలిపారు.

వైవీయూ క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన

● 160 మంది ఎంపిక

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ప్రముఖ బయోకాన్ మల్టీ నేషనల్ కంపెనీ వైవీయులో చేపట్టిన ఎంపికలకు తిరుపతి, వైజాగ్, గుంటూరు, రాజమండ్రి, బాపట్ల, అన్నమయ్య, కడప జిల్లాల నుంచే కాకుండా చత్తీస్‌ఘడ్, ఒడిస్సా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 500 మంది ఇంజనీరింగ్, డిగ్రీ, పీఈ అర్హత గల అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ ఈ క్యాంపస్ డ్రైవ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రతిభావంతులకు భవిష్యత్తునిస్తున్న బయోకాన్ కంపెనీని స్వాగతించారు. బయోకాన్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించి 160 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు ప్రొఫెసర్ చంద్రమతి శంకర్, ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధులు డాక్టర్ లలిత, డాక్టర్ గణేష్‌నాయక్, డాక్టర్ సుభాష్‌చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి.. క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన యువత

నేడు జేఎన్టీయూలో క్రీడా దినోత్సవం

కలికిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం క్రీడా దినోత్సవం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కె.చంద్రశేఖర్ రాజు పాల్గొంటారు. సాయంకాలం నిర్వహించే వార్షికోత్సవానికి అనంతపురం జేఎన్టీయూ వీసీ హెచ్.సుదర్శన రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

నేడు చౌడేశ్వరి జాతర


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయునిపల్లిలో శుక్రవారం చౌడేశ్వరి జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం పూజల అనంతరం అమ్మవారు సింహ వాహనంపై దర్శనమిస్తారని తెలిపారు. శనివారము ఉట్ల తిరునాల జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

కనులపండువగా దిగువ బండెమ్మ రథోత్సవం


పురవీధులలో ఊరేగుతున్న అమ్మవారు

రామసముద్రం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం కాప్పల్లె పంచాయతీ గజ్జలవారిపల్లెలో గురువారం దిగువ బండెమ్మ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పలు రకాల పుష్పాలతో అలంకరించి రథంపై పురవీధులలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోవా కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు పంపిణీ చేస్తున్న కనుగొండ మద్దిరెడ్డి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మల్లయ్యకొండ ఆలయ మాజీ ఛైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి మనవళ్లు యోగిత్‌రెడ్డి, యోధత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం మదనపల్లెలోని స్మైల్ స్కూల్, తంబళ్లపల్లెలోని ప్రభుత్వ పాఠశాల, వాల్మీకిపురంలోని వృద్ధాశ్రయంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్సిల్స్ అందజేసి, వృద్ధులకు అన్నదానం చేశారు. బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పునీత్, పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం శ్రేయస్కరం

బి.కొత్తకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులలో ప్రసవం తల్లి, బిడ్డలకు శ్రేయస్కరమని బి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డా.కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక సీహెచ్‌సీలో సాధారణ ప్రసవంపై గర్భిణులకు అవగాహన కల్పించారు. డా.ఆరీపుల్లా, డా.హసీనాపర్వీన్ పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ వెలవెల!


సందర్శకులు రాక వెలవెలబోతున్న ఫారెస్ట్ క్యాంపస్


మూతపడిన ఓ హోటల్ సముదాయం


జనసంచారం లేక బోసిపోతున్న ప్రధాన సందర్శన ప్రదేశం గాలిబండ

- పర్యాటకులు లేక బోసిపోయిన ఆంధ్రా ఊటీ..
- రికార్డు స్థాయిలో పడిపోయిన ఆదాయం
- హోటళ్లు.. బుకింగ్స్ లేక గెస్ట్‌హౌస్‌లు మూత
- దయనీయ స్థితిలో ఏపీ టూరిజం

బి.కొత్తకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాఊటీగా పేరుపొందిన హార్సిలీహిల్స్ ప్రస్తుతం పర్యాటకులు లేక బోసిపోతోంది. దీంతో ఏపీ టూరిజం ఆదాయం గతంలో ఎన్నడూ లేనంత కనిష్ఠస్థాయికి పడిపోయింది. ఆహ్లాదకర వాతావరణం కావాలనుకునే వారందరికీ గుర్తొచ్చే ప్రదేశం హార్సిలీహిల్స్ మాత్రమే. సాధారణ జనం ఉన్నంతలో అలా.. వెళ్ళి వద్దాం అనుకున్నా, ఎంత ఖర్చయినా పర్లేదు బాగా రిచ్‌గా ఎంజాయ్ చెయ్యాలి అనే సంపన్నులకైనా తగిన సదుపాయాలు ఉండటంతో హార్సిలీహిల్స్ ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది. అయితే, సుమారు రెండు నెలలుగా పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. ఏపీ టూరిజంతో పాటు, ప్రైవేటు రిసార్ట్‌లు, హోటళ్లు, చిరువ్యాపారులు, ట్యాక్సీ డ్రైవర్లు ఆదాయం లేక ఉసూరుమంటున్నారు.

నిబంధనల పేరుతో..

ఇంత దారుణంగా వ్యాపారం పడిపోవడానికి పలు కారణాలు చెబుతున్నారు. ప్రధానంగా పోలీసులు నిబంధనల పేరుతో పర్యాటకులను యక్షప్రశ్నలు వేస్తుండడం, సోదాలంటూ పర్యాటకుల ఆత్మాభిమానానికి భంగం కలిగిస్తుండటంతో బృందాలుగా కొండమీదకు వచ్చి రూములు బుక్ చేసుకొని నైట్ పార్టీలు పెట్టుకునేవారు, సరదాగా కొండపై విహరించి చల్లటి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించాలి అనుకునే జంటలు హిల్స్‌కు టాటా చెప్పి ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవడం ప్రధాన కారణంగా చెబుతున్నారు. రంజాన్ మాసం, ఇంటర్, పదవ తరగతి పరీక్షల వల్ల కూడా పర్యాటకులు రాలేదు. ఇక్కడ ఏపీ టూరిజంకు చెందిన 54 కాటేజీలు, లగ్జరీ రూములు ఉండగా బుధవారం 9 గదులు మాత్రమే బుక్ కావడం గమనార్హం. అది కూడా ఉగాది, రంజాన్ సెలవుల నేపథ్యంలోనే.. పర్యాటకులను ఆకర్షించడానికి టౌన్‌షిప్ కమిటీ, ఏపీటూరిజం, ఫారెస్ట్ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, ఎక్కడా లేని ఆంక్షలతో సాధారణ స్థాయి పర్యాటకం కూడా లేకుండా పోయిందని అటు ప్రభుత్వరంగ, ప్రైవేటు సిబ్బంది, చిరువ్యాపారులు వాపోతున్నారు. మళ్లీ ఎప్పుడు హార్సిలీహిల్స్ కళకళలాడుతుందోనని ఎదురుచూస్తున్నారు.

సీఎం చంద్రబాబుతోనే వక్ఫ్ ఆస్తుల సంరక్షణ!


మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులను సంరక్షించేందుకు సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక బెంగళూరు బస్టాండులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చమర్తి మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులపై మైనారిటీలు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని ముస్లింల మనోభావాలు దెబ్బతీయనని భరోసా ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వక్ఫ్ బిల్లులో కొన్ని సవరణలు చేయాలని స్పష్టం చేశారన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ప్రతిపాదించిన వక్ఫ్ ఆస్తుల బిల్లులపై సీఎం చంద్రబాబు స్పష్టంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలోని ముస్లిం ప్రజాప్రతినిధులతో చర్చించారని, వక్ఫ్ ఆస్తులను కాపాడుతానని సీఎం చెప్పారన్నారు. ఈ భూములు వక్ఫ్ పేరుతోనే ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. ఉన్నతాధికారులతో విచారణ జరిపించి వక్ఫ్ ఆస్తులను కాపాడుతారన్నారు. చాలా వాటికి సరైన డాక్యుమెంట్లు లేవని కేంద్ర ప్రభుత్వం చెపితే, దానికి రాష్ట్ర ప్రభుత్వం డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని నివేదికలు ఇస్తుందన్నారు. మదనపల్లెలో వున్న వక్ఫ్ ఆస్తులను కాపాడే బాధ్యత తాను తీసుకుంటున్నానన్నారు. జగన్ మాత్రం మైనారిటీలపై కపట ప్రేమ చూపిస్తున్నారని, ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలు వక్ఫ్ ఆస్తులను కబ్జా చేశారని, దీనిపై ఓపెన్ డిబేట్‌కు తాను సిద్ధమన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల దోపిడీలు బయట పెడతానని దమ్ముంటే తన ఆరోపణలు నిజం కావని నిరూపించుకోవాలని వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ఏ మస్తాన్, ఆర్‌జే వెంకటేశ్, బాలుస్వామి, నాగయ్య, నీలకంఠ, రామాంజులు, దుర్గా, బాబునాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును ఆమోదించడం అన్యాయం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌చట్ట సవరణ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్‌కే బాషా విమర్శించారు. గురువారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలకు అన్యాయం చేసే వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వడం ముస్లిం సమాజానికి ద్రోహం చేయడమే అన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాధీనం చేసుకుని అందులో మైనార్టీల అభివృద్ధి కోసం, మదరసాలు, యునాని ఆస్పత్రులు, షాదీ మహళ్లు, విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2024 బిల్లు లోక్‌సభ ఆమోదం పొందడం అంటే ముస్లింలకు చీకటి రోజులే అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీల పట్ల తమ వైఖరిని మార్చుకోవాలని, లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

ఆటోనగర్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాంత ఆటో వర్కర్స్‌కు ఆటోనగర్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం మండలంలోని వలసపల్లె పంచాయతీ వద్ద అపరిష్కృతంగా ఉన్న ఆటోనగర్‌ను ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తితో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 ఏళ్లగా వివాదంలో వున్న ఆటోనగర్ స్థలంపై కోర్టులో దావా వేసిన రైతు రమణయ్యతో మాట్లాడామని ఆయన ఈ స్థలం అప్పగించడానికి సుముఖంగా ఉన్నారన్నారు. ఆయనకు కూడా న్యాయమైన పరిహారం ఇప్పిస్తామన్నారు. పూర్తి స్థాయిలో ఆటోనగర్‌కు భూములు సేకరించాక అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ మేనేజర్ హరిప్రసాద్‌రెడ్డి, రైతులు సీతక్క, యుగంధర్, గురు, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణ ప్రణాళికపై ఎస్‌హెచ్‌జీ సభ్యులకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం జవహర్ బాషా

పీలేరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల నిర్వహణలో వార్షిక రుణ ప్రణాళికలు ఎంతో కీలకమని వెలుగు పథకం ఏపీఎం జవహర్ బాషా తెలిపారు. పీలేరు మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు గురువారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వార్షిక రుణ ప్రణాళికలు, జీవనోపాధుల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంఘ సభ్యులకు జీవనోపాధి ఏర్పాటు, కుటుంబ అవసరాలకు, పెట్టుబడికి రుణం, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేసుకునేందుకు మొబైల్ యాప్ ఇచ్చామన్నారు.

ఆ యాప్‌లో ప్రస్తుతం ఉన్న నిల్వ, అప్పు, కావాల్సిన రుణ వివరాలు నమోదు చేయడం ద్వారా సంఘాలను సమర్థవంతంగా నిర్వహించవచ్చు నన్నారు. 25 ఏళ్లగా సంఘాలలోని మహిళలు వివిధ బ్యాంకుల ద్వారా బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీనిధి, సీఐఎఫ్ రుణాలు తీసుకుని ఆర్థికంగా, సామాజికంగా బలో పేతమయ్యారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం యాప్‌లో వివరాల నమోదు తీరుతెన్నులను ఆయన మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ


పశువుల తాగునీటి తొట్టె పనులను ప్రారంభిస్తున్న పీడీ వెంకటరత్నం

రామసముద్రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారిగానిపల్లెలో గురువారం పీడీ వెంకటరత్నం ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పూల తోటలను పరిశీలించారు. నీటి కుంట పనులు ప్రారంభించారు. అనంతరం ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ కూలీలను సమీకరించాలని, పనులు నాణ్యతగా చేయాలని, పశువుల తాగునీటి తొట్టెలు నిర్మించాలని, గడ్డి పెంపకం , పూల తోటల పనులను చేపట్టాలని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి కూలి రూ.307కు పెంచినట్లు తెలిపారు. పనులు చేయని క్షేత్ర సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ సిబ్బంది, ఏపీవో మాధవి, జేఈ రెడ్డి, ఈశ్వర్, మణికంఠ, గీతాంజలి, షఫీనా, నర సింహులు, జనార్దన, ఆలీషా, పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించండి


మాట్లాడుతున్న న్యాయాధికారి ఉమర్ ఫరూక్

తంబళ్లపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్ ఫరూక్ సూచించారు. లీగల్ అవేర్ నెస్ క్యాంపులో భాగంగా గురు వారం జడ్జి స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మౌలిక వసతులు, బోధ నాసరళి, సిబ్బంది పనితీరును పరిశీ లించారు. భవిత కేంద్రంలోని దివ్యాంగుల వివరాలు, సమస్యలను బోధనా సిబ్బంది తో పాటు, తల్లితండ్రులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు, వసతులపై జడ్జి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగులకు అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని చిన్నారుల తల్లితండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజు, ఐఈ టీచర్లు రేఖ, శ్రావణి, ఫిజియోథెరపి సరళ, కేర్ టేకర్ నాగరత్నమ్మ, సీఆర్పీ సుధాకర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్టీ, ఎస్సీ భూముల కబ్జాపై అధికారుల నిర్లక్ష్యం'

పీలేరు రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):ఎస్సీ, ఎస్టీ భూములు యథేచ్ఛగా ఆక్రమణలకు గురౌతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధరణికుమార్ ఆరోపించారు. పీలేరు మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం రేగళ్లు, ఎర్రగుంట్లపల్లె పంచాయతీల్లోని ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన భూములను అగ్రకులాలవారు ఆక్రమించుకొని దళితులను రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోయారు. భూ బకాసురులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పూర్తి ఆధారాలతో జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మాలమహానాడు కార్యవర్గ సభ్యులు జి.వెంకటేశ్, గంగయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ వన్ డిపో కార్యవర్గం నియామకం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వన్ డిపో ఎం ప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్య దర్శులుగా మధుసూదన్, ఈశ్వరప్ప నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర నాయకుడు ఎన్‌వి కుమార్, జిల్లా అధ్యక్షుడు సీఎబాబు, వైస్ ప్రెసిడెంట్ కె.ప్రకాష్ నూతన కమిటీ పరిచయ కార్యక్రమం నిర్వ హించారు. డిపో మేనేజరును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రాజన్న, శేఖర్, మల్లికార్జున, అలియా, శారద, రత్నమ్మ, బాబు, కుమార్,ఎన్‌జే నాయుడు, అక్కులప్ప, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

రామసముద్రం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి పంచాయతీలో అవసరాన్ని బట్టి ఒకటి రెండు చలివేంద్ర కేంద్రా లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో భాను ప్రసాద్ గ్రామ సర్పంచ్‌లకు సూచించారు. గ్రామాల్లోని రచ్చబండ వద్ద, బాటసారులతో రద్దీగా ఉన్న చోట, బస్టాండ్‌లలో, సంతలు జరిగే చోట చలివేం ద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు సర్పంచ్‌లు చొరవ చూపాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో తెలిపారు.

చెత్త సద్వినియోగంతో సంపద సృష్టి

పీలేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యో తి): గ్రామ పంచాయతీలు చెత్తను సమర్థవంతంగా వినియోగించు కుంటే సంపదగా మారుతుందని పీలేరు ఈవో పీఆర్‌ఆర్‌డీ లతీఫ్ ఖాన్ తెలిపారు. గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణపై పీలేరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం లో కేవీపల్లె మండలంలోని గ్రామ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘన, ద్రవ వ్యర్థాల సమర్థ నిర్వహణలో భాగంగా ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. చెత్తను కేంద్రాలకు తరలించిన తరువాత దానిని ఎరువుగా మార్చుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీలేరు శ్యానిటరీ అధికారి నౌషాద్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి కిందపడి యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):కొబ్బరి చెట్టుపై నుంచి కింద పడి యువకుడు మృతి చెందినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గురువారం సాయంత్రం మదనపల్లె మండలం, రామాచార్లపల్లెకు చెందిన రాజు(42) కొబ్బరి చెట్టు ఎక్కి టెంకాయపట్టలు కొట్టే ప్రయత్నంలో ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందాడు. తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, తెలిపారు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. స్థానిక నీరుగట్టువారిపల్లె, పాతూరుకు చెందిన రామ్మోహన్(48) తన భార్యతో కలిసి ఎర్రగానిమిట్ట సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్దకు వెళ్లి వస్తుండగా కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది, ఈ ప్రమాదంలో రామ్మోహన్ గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ


శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కలికిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా రూపొందించిన శక్తి యాప్ మహిళలకు సదా రక్షణగా ఉంటుందని పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో శక్తి యాప్‌పై గురువారం విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ సెల్ ఫోన్లలో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ఇది అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజలీదేవి, హెచ్‌సీ మదనమోహన్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ కల్పన, అధ్యాపకులు స్వర్ణలత, మాధవి, కీర్తి, లిఖిత, సాజీరా, విద్యార్థినులు పాల్గొన్నారు.

రేపు పీలేరు నియోజకవర్గ టీడీపీ సమావేశం

కలికిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం శనివారం సాయంకాలం నగరిపల్లెలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడ, కేవీ పల్లె, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గంలోని అనుబంధ సంఘాల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, పార్టీ గ్రామ, పట్టణ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వడదెబ్బపై అవగాహన


వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప కోరారు. గుండ్లూరు పంచాయతీలో గురువారం 104 సేవల సందర్భంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడగాడ్పుల గురించి రాష్ట్ర విపత్తుల శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. క్యాన్సర్ వ్యాధి గుర్తింపు కోసం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రజలు సహకరించాలని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన వారిని రెఫరల్ ఆసుపత్రులకు పంపి చికిత్స చేయించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఆరోగ్య అవగాహన కర్త మహ్మద్ రఫీ, ఆరోగ్య కార్యదర్శులు సిద్దమ్మ, ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పి నాగవేణి, మహిళా పోలీసు మౌనిక, ఆశా కార్యకర్తలు, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


పెద్దమండ్యం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే కుటుంబ సాధికార సారథుల ధ్యేయమని పెద్దమండ్యం మండల టీడీపీ నేతలు తెలిపారు. యువనేత సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం పెద్దమండ్యంలో కుటుంబ సాధికార సారథుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 60 మంది ఓటర్లకు ఇద్దరు కుటుంబ సాధికార సారథులను ఎన్నుకుంటారని తెలిపారు. వీరు ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేర్చడం లక్ష్యంగా పని చేస్తారని తెలిపారు. గ్రామాలలో కార్యకర్తలు పటిష్టంగా పని చేయాలన్నారు. పేద కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అన్ని గ్రామాలలో సకాలంలో కేఎస్‌ఎస్ ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. టీడీపీ నేతలు యుగంధర్ రెడ్డి, కుంటకిందపల్లి చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ నాగార్జున, ఫరూక్, రెడ్డిపీర, చిన్న రెడ్డిపీరా తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 29 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సీఎన్‌ఆర్ యాజమాన్యం

పీలేరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో చెన్నైకు చెందిన ఏఆర్‌కేహెచ్‌ఆర్ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ సంస్థ గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 29 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు పీలేరులోని సీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2 లక్షల ప్యాకేజీ వర్తిస్తుందన్నారు. జాబ్ మేళాలో 48 మంది విద్యార్థులు పాల్గొనగా 29 మంది ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఎంపికైన వారికి ఆ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్‌లు కుసుమ, సురేశ్ కుమార్‌లు నియామకపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.లావణ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివశంకర్

పీలేరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని పీలేరు ఎంపీడీవో శివశంకర్ సూచించారు. పీలేరు మండల పరిషత్ కార్యాలయంలోపంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీలేరు మండలంలోని 15 గ్రా మ పంచాయతీల్లో ఎప్పటికప్పుడు తాగు నీటి సరఫరాపై ప్రత్యేక చొరవచూపాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ సమస్య ఉత్పన్నమైన చోట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వారానికి ఓ సారి నీటి ఎద్దడిపై సమీక్షిం చాలని తెలిపారు. ఈవోఆర్డీ లతీఫ్‌ఖాన్, ఏఈ ఇరగన్న పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్టె పనులకు భూమిపూజ


నీటి తొట్టె పనులకు భూమిపూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో పశువులకు నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. గురువారం ఏపీవో తిరుపాలప్పతో కలిసి రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెలో నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ చేశారు. జేఈ సుధాకర్, నాయకులు రాగిపాళెం బావన్న, ఆదెన్న, ప్రభాకర్, పాల ఆంజనేయులు రెడ్డి, చంద్రశేఖర్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర పాల్గొన్నారు